పెన్ పవర్
తెలంగాణ రౌండప్

కేసీఆర్ దార్శనికతకు ప్రపంచ బ్యాంక్ గుర్తింపే నిదర్శనం

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణను ఎగువ మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ బ్యాంక్ గుర్తించడం.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనిక నాయకత్వానికి, పరిపాలనా దక్షతకు దక్కిన అంతర్జాతీయ స్థాయి గుర్తింపు అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. “2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4.19 లక్షల(5,407 అమెరికన్ డాలర్లు) తలసరి ఆదాయంతో తెలంగాణ.. ప్రపంచ బ్యాంక్ ఎగువ మధ్య ఆదాయ కేటగిరీలో చేరింది. ఈ మైలురాయిని సాధించిన ఐదు భారతీయ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. కేసీఆర్ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించిన అసాధారణ ఆర్థిక పరివర్తనకు ఈ విశేష విజయమే అద్దం పడుతోంది. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ.. కేవలం పదేళ్ల వ్యవధిలోనే తన ఆర్థిక తలరాతను తిరగరాసుకుని భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా అవతరించింది. పారిశ్రామిక అనుమతుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి.. అపూర్వమైన పెట్టుబడులను ఆకర్షించిన టీఎస్-ఐపాస్‌తో పాటు.. కాళేశ్వరం

- మిగతా 4లో...

వాటర్ బోర్డు అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బిక్షపతి యాదవ్..

నిజాంపేటలో తాగునీటి సమస్య..!

- వాటర్ బోర్డు అధికారులకు భాజపా వినతిపత్రం..!
- పైప్‌లైన్ నీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచాలని విజ్ఞప్తి..
- ట్యాంకర్ బుకింగ్‌ల అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్..

నిజాంపేట సర్కిల్ పరిధిలో రోజురోజుకు జనాభా పెరుగుతోందని, ప్రస్తుతం దాదాపు నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నప్పటికీ, అవసరమైన మేరకు తాగునీటి సరఫరా జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడికి రోజుకు 135 లీటర్ల (ఎల్‌పిసిడి) త్రాగునీరు అందించాల్సి ఉన్నప్పటికీ, అధికారిక లెక్కల ప్రకారం నిజాంపేటకు కేవలం 4 నుంచి 8 యంజిడి వరకు మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు.. ఈ సరఫరాను కనీసం “30 యంజిడి” వరకు పెంచి, అన్ని కాలనీలకు పైప్‌లైన్ ద్వారా క్రమబద్ధంగా తగినంత తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమంలో భాజపా ప్రధాన కార్యదర్శి సచిన్, శ్రీనివాస్ గుప్తా, సెక్రటరీ పాండు, ట్రెజరర్ త్రినాథ్, బీజేవైఎం అధ్యక్షుడు రాజేష్ ముదిరాజ్, ఎక్స్-సర్వీస్ సెల్ కన్వీనర్ ఈశ్వరరావు, నాయకులు అమరేందర్ బాబు, కాలనీవాసులు వెంకట్రావు, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

- నిజాంపేటలో తీవ్ర తాగునీటి సమస్యపై వాటర్ బోర్డుకు భాజపా వినతిపత్రం.
- పైప్‌లైన్ ద్వారా సరిపడా నీరు లేక..! ట్యాంకర్ల పైనే ఆధారపడుతున్న..
- నాలుగు లక్షల జనాభాకు ప్రస్తుతం కేవలం ‘4--8 యంజిడి’ నీటి సరఫరా మాత్రమే..?
- ఎల్‌పిసిడి ప్రమాణాల ప్రకారం ప్రతి పౌరుడికి 135 లీటర్ల నీరు అందించాలి..
- నిజాంపేటకు కనీసం ‘30 యంజిడి నీటి కేటాయించి, శాశ్వత పరిష్కారం చూపాలి..

దుండిగల్, పెన్ పవర్, జూలై 8: నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధిలోని బండారి లేఅవుట్ తోపాటు పలు కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భాజపా నాయకులు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి) నిజాంపేట డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.. నిజాంపేట--బండారి లేఅవుట్ బీజేపీ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఈ వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ, స్థానిక అపార్ట్‌మెంట్లు, కాలనీలు నీటి కనెక్షన్లు, అభివృద్ధి ఛార్జీల పేరుతో ఒక్కో అపార్ట్‌మెంట్ రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెల్లించినప్పటికీ, పైప్‌లైన్ ద్వారా తగినంత తాగునీరు అందించడంలో వాటర్ బోర్డు విఫలమవుతోందని ఆరోపించారు. దీంతో ప్రజలు ఆన్‌లైన్ ట్యాంకర్ బుకింగ్‌లు, ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడి, ప్రతి నెల అదనపు ఆర్థిక భారం భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు.. ఆన్‌లైన్ ట్యాంకర్ బుకింగ్ విధానంలో పారదర్శకతపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని, కొంతమంది అధికారులు ప్రైవేట్ ట్యాంకర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ అంశంపై విజిలెన్స్ విభాగంతో సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

సాగునీరు, రైల్వే ప్రాజెక్టులపై సమన్వయ సమీక్ష

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో సాగునీరు, రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో దిల్లీ నుంచి కేంద్ర క్యాబినెట్ సచివాలయ సమన్వయ కార్యదర్శి మనోజ్ గోవిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా.. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న నీటిపారుదల, రైల్వే ప్రాజెక్టుల పనులు, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, పెండింగ్ సమస్యలను ఉమ్మడి సమన్వయంతో వేగంగా పరిష్కరించే విషయమై చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- మిగతా 4లో...

మొసలి కన్నీరు కారుస్తున్న గత పాలకులు

హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్‌ది నిరుపేదలకు అండగా నిలిచే ఇందిరమ్మ ప్రభుత్వమని.. ప్రజలను దోచుకుని ఫామ్‌హౌసుల్లో దాచుకునే ప్రభుత్వం కాదని గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గద్వాల జిల్లా ర్యాలంపాడులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు, రెండో విడత ఇళ్లకు ప్రొసీడింగ్స్ అందజేత కార్యక్రమాల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ఆయన పాల్గొన్నారు. మాజీ సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ర్యాలంపాడులో నివాళులర్పించారు. నాడు రాష్ట్రవ్యాప్తంగా పలు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి, నిర్మాణం పూర్తిచేయడం వల్లే నేడు రైతు కుటుంబాలు సుఖసంతోషాలతో ఉన్నాయన్నారు. కాళేశ్వరం పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టిన గత పాలకులు నేడు రైతుల పట్ల మొసలికన్నీరు కారుస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, రెండో విడతలో మరో 2.50 లక్షలు, క్యూర్ పథకంలో లక్ష ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ప్రతి నిరుపేద కుటుంబం ఇల్లు నిర్మించుకునే వరకు ఈ పథకం కొనసాగుతుందన్నారు. నాడు ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి కుర్చీ వేసుకొని కూర్చుంటానని ప్రకటించిన మాజీ సీఎం, తర్వాత విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘంలో..!

చేపల వేట వివాదం..!

- ఖమ్మం జిల్లా కాకరవాయిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ..
- పలువురికి గాయాలు.. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు..
- చేపల వేట వివాదంతో రణరంగంగా మారిన మద్దుల చెరువు..
- ఇరు వర్గాల ఘర్షణలో పలువురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు..!
- పరస్పర ఆరోపణలతో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిన ఇరు వర్గాలు..
- మూడేళ్లుగా కొనసాగుతున్న మత్స్యకార సంఘ విభేదాలు.. దర్యాప్తు ప్రారంభం..!

తిరుమలాయపాలెం, పెన్ పవర్,జూలై 8: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామ మత్స్యకార సంఘంలో చేపల వేట అంశం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం మద్దుల చెరువులో చేపలు పట్టే విషయంలో ఆ సంఘానికి చెందిన రెండు వర్గాల మధ్య తీవ్ర వివాదం చోటుచేసుకోగా, క్రమంగా ఘర్షణకు దారితీసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ ఘటనలో ఇరు వర్గాలకు చెందిన పలువురు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. చేపల వేట హక్కులు, సంఘ నిర్వహణకు సంబంధించిన అంతర్గత విభేదాలే ఈ ఘర్షణకు కారణమని ఇరు వర్గాలు పరస్పరం ఆరోపించుకున్నాయి.. గత మూడు సంవత్సరాలుగా మత్స్యకార సంఘంలో కొనసాగుతున్న విభేదాల వల్ల కాకరవాయి చెరువుల్లో చేపల వేట సక్రమంగా సాగడం లేదని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదాల కారణంగా పలుమార్లు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని వారు తెలిపారు.ఘటన అనంతరం ఇరు వర్గాల సభ్యులు తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయంపై ఎస్సై కూచిపూడి జగదీష్ మాట్లాడుతూ, ఇరు వర్గాల ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షణ చేపట్టినట్లు వెల్లడించారు.

మత్స్యకార సంఘ వివాదానికి రాజకీయ రంగు..?

కాకరవాయి మత్స్యకార సంఘంలో కొనసాగుతున్న వివాదానికి గ్రామ పంచాయతీ రాజకీయాలు కూడా తోడయ్యాయనే ఆరోపణలు మరో వర్గం తెరమీదకి తీసుకొచ్చారు. సంఘంలోని ఒక వర్గానికి గ్రామ ప్రస్తుత సర్పంచ్ అండగా వ్యవహరిస్తున్నారని మరో వర్గం తీవ్ర ఆరోపణలు చేస్తోంది.. దీంతో సాధారణంగా సంఘ అంతర్గత సమస్యగా ఉన్న వివాదం రాజకీయ రంగు పులుముకుంటోందని గ్రామంలో చర్చ జరుగుతోంది.. అంతేకాకుండా, గతంలో సర్పంచ్ మద్దతు ఉన్న వర్గం చేపల వేట ద్వారా వచ్చిన ఆదాయంలో సుమారు రూ.16 లక్షలు అక్రమంగా దండుకున్నారని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తోంది.. ఆ నిధుల లెక్కలు ఇప్పటివరకు సభ్యులకు వెల్లడించలేదని, ఆదాయ, వ్యయాలపై పారదర్శకత పాటించలేదని వారు విమర్శిస్తున్నారు. ఈ అంశంపై పలుమార్లు ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని కూడా ఆరోపిస్తున్నారు.

చేపల వేటను అడ్డుకునేందుకే..!

తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామ మత్స్యకార సంఘంలో బుధవారం జరిగిన ఘర్షణపై మరో వర్గం తమ వాదనను వెల్లడించింది. సంఘ నిబంధనల మేరకు చేపల వేట నిర్వహిస్తుండగా, ప్రత్యర్థి వర్గం ఉద్దేశపూర్వకంగా వచ్చి చేపల వేటను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని వారు ఆరోపించారు.చేపల వేట జరుగుతున్న సమయంలో ప్రత్యర్థి వర్గం రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడంతో మొదట వాగ్వాదం జరిగి, అనంతరం అది ఘర్షణకు దారితీసిందని తెలిపారు. ఈ ఘటనలో తమ వర్గానికి చెందిన పలువురు కూడా గాయపడ్డారని, తమపైనా దాడి జరిగిందని పేర్కొన్నారు.. ఘటన అనంతరం తమపై అసత్య ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపించారు. వ్యక్తిగత కక్షలు, సంఘంలోని పాత విభేదాలను లక్ష్యంగా చేసుకుని, తమ వర్గంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.. మత్స్యకార సంఘానికి సంబంధించిన అన్ని నిర్ణయాలు సంఘ సభ్యుల సమక్షంలోనే తీసుకుంటామని, చేపల వేట, ఆదాయ, వ్యయాల వ్యవహారాలు కూడా నిబంధనల ప్రకారమే నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఆధారాలు లేకుండా అక్రమాల ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు..ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, తప్పుడు ప్రచారం చేసి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కేసీఆర్ దార్శనికతకు ప్రపంచ బ్యాంక్ గుర్తింపే నిదర్శనం

-3 పేజి తరువాయి

ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి ప్రతిష్ఠాత్మక పథకాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మిళిత వృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి, పారిశ్రామిక విస్తరణకు, మెరుగైన ఉపాధికి బలమైన పునాది వేశాయి. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణను దివాలా తీసిన రాష్ట్రంగా చిత్రించడాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇకనైనా మానుకోవాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

సాగునీరు, రైల్వే ప్రాజెక్టులపై సమన్వయ సమీక్ష

-3 పేజి తరువాయి

భవిష్యత్తు తరం డిజిటల్ సేవా వేదికలను రూపొందించాలి: సీఎస్

రాష్ట్రంలో పౌర సేవలను మరింత సమర్థంగా, సాంకేతిక ఆధారితంగా అందించేందుకు భవిష్యత్ తరం డిజిటల్ సేవ వేదికలను రూపొందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలో అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు.

1,500 కండక్టర్ పోస్టులకు 'రైట్ రైట్'

ఎంపికకు పదో తరగతి విద్యార్హత

సమస్యగా మార్కుల శాతం.. గ్రేడింగ్ విధానం

స్పష్టతకు ఎస్సెస్సీ బోర్డును సంప్రదించిన ఆర్టీసీ

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రవ్యాప్తంగా 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) యాజమాన్యమే ఈ పోస్టుల భర్తీని చేపట్టనుంది. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ పోస్టులకు ఉద్యోగుల్ని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో నియామక ప్రక్రియపై ఆర్టీసీ యాజమాన్యం దృష్టి సారించింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం టీజీఎస్‌ఆర్టీసీ ఆవిర్భవించిన తర్వాత ఇప్పటివరకు కండక్టర్ పోస్టులను భర్తీ చేయలేదు. ప్రతి ఏటా ఉన్న ఉద్యోగులే రిటైరవుతుండటంతో ఖాళీలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ మేరకు కొంతకాలం క్రితం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తాత్కాలికంగా హైదరాబాద్, సికింద్రాబాద్ సహా వివిధ రీజియన్ల పరిధిలోని డిపోల్లో నియమించింది. ఇప్పుడు ప్రభుత్వం అనుమతించడంతో 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ఆర్టీసీ సమాయత్తమవుతోంది. మార్కులు వర్సెస్ గ్రేడింగ్: కండక్టర్ పోస్టులకు పదో తరగతిలో వచ్చిన మార్కుల శాతాన్ని ఆధారంగా తీసుకుని ఎంపిక చేసే విధానం ఆర్టీసీలో ఉంది. రీజియన్ల వారీగా ఖాళీలు, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుంటూ నియామక ప్రక్రియ జరిగేది. ఆ

తర్వాత పదో తరగతిలో గ్రేడింగ్ విధానం అమల్లోకి వచ్చింది. మళ్లీ ఇప్పుడు గ్రేడింగ్ విధానం పోయి మార్కుల శాతం వచ్చింది. దీంతో కండక్టర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల్లో కొందరు మార్కుల శాతంతో, మరికొందరు గ్రేడ్ పాయింట్లతో దరఖాస్తు చేసే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఈ రెండు విధానాలను ఎలా పరిగణనలోకి తీసుకోవాలన్న అంశంపై కసరత్తు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు ఎస్సెస్సీ బోర్డుకు ఆర్టీసీ యాజమాన్యం తాజాగా లేఖ రాసింది. గ్రేడింగ్‌ను మార్కుల శాతంగా ఎలా లెక్కించాలి అనే విషయంపై ఎస్సెస్సీ బోర్డు నుంచి స్పష్టత తీసుకుని..కండక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆర్టీసీ భావిస్తున్నట్లు సమాచారం.

ఎస్ఐఆర్ కార్యక్రమం పై కలెక్టర్ సమావేశం

హైదరాబాద్ పెన్ పవర్: ఖమ్మంకలెక్టరేట్ మిటింగ్ హాల్ నందు జిల్లాకలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు.ప్రతి అర్హమైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షిస్తూ, ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను దాదాపు పంపిణీ పూర్తి చేశామని, వాటిని తిరిగి సేకరించి ఆన్లైన్లో నమోదు చేసే డిజిటైజేషన్ ప్రక్రియను చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (దీూాం), బూత్ లెవల్ అధికారులు (దీూాం), ప్రజలు సమిష్టిగా సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఓటరికి ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి తమ వ్యక్తిగత వివరాలను సక్రమంగా అందించడం ద్వారా ఎన్నికల జాబితాల శుద్ధీకరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అన్మ్యాప్డ్ ఓటర్లు నిర్దేశించిన 11 ధృవీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని సమర్పించాలని, అవసరమైన పత్రాలు సమర్పించిన వారి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో పొరపాట్లు ఉన్నా తప్పనిసరిగా అభ్యంతరాలు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని ప్రజలకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, ఎవరి ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత అందరికీ ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

రాజకీయ పార్టీలు తమ ప్రతి బీఎల్ఏ సంబంధిత పార్టీ జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. బీఎల్వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేసి సమస్యలు, సందేహాలను వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎల్వోలకు అదనపు సహాయక సిబ్బందిని కూడా నియమించినట్లు వెల్లడించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది అని, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు, రాజకీయ పార్టీలు, ఎన్నికల సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

విద్యార్థిపై ప్రిన్సిపల్ లైంగిక దాడి
ప్రిన్సిపల్ ప్రైవేట్ పార్టును కొరికిన విద్యార్థి

నాగర్ కర్నూలు: పెన్ పవర్: నాగర్ కర్నూల్ జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కొల్లాపూర్లో ఓ విద్యార్థిపై పీజీ కళాశాల ప్రిన్సిపల్ మార్క్ పోలోనియస్ లైంగికంగా, మానసికంగా దాడికి పాల్పడ్డాడు. భాదిత విద్యార్థి 2025లో PG పూర్తి చేసిన తనకు టీసీఇవ్వాలని ప్రిన్సిపల్ను కోరగా, ఇంటికి వస్తే ఇస్తానని చెప్పడంతో ప్రిన్సిపల్ ఇంటికి తన ఫ్రెండ్తో కలిసి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు తన ఇంటికి విద్యార్థిని పిలిపించుకొని ప్రిన్సిపల్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిత్రహింసలకు గురి చేస్తుండడంతో ప్రిన్సిపల్ ప్రైవేట్ పార్టును విద్యార్థి కొరికాడు. దాంతో ప్రిన్సిపల్ నగ్నంగా పారిపోయాడు. బాధిత విద్యార్థి రాత్రి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చాడు. తక్షణమే ప్రిన్సిపల్ను సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్.

రేవంత్ రెడ్డికి వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్

హైదరాబాద్ పెన్ పవర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద ప్రస్తుత పరిస్థితిని వివరించారు.

ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కన్నెపల్లి పంప్ హౌస్లో 92 మీటర్ల వద్ద నీళ్లు ఉంటే లిఫ్ట్ చేసే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పుడు 102 మీటర్ల వద్ద నీళ్లు ఉన్నాయి. గోదావరిలో నీళ్లు లేకపోయినా, ప్రాణహిత నది కలిసే చోటు నుంచి తీవ్ర వరద ప్రవాహం ఉంది. ప్రాణహిత నది నుంచి ఏ కాలంలో అయినా నీళ్లు తీసుకునే అవకాశం ఉంటుంది కాబట్టే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును ఈ విధంగా నిర్మించారు. బీఆర్ఎస్ పార్టీ మీద కోపంతో అసలు నీళ్లే లేవని చెప్పి రైతులను ఆగం చేయడం సరికాదని అన్నారు.

ఇప్పటికైనా కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేసి నీళ్లు లిఫ్ట్ చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించండని అన్నారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి
ఘనంగా నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అయనకు ఘనంగా నివాళులర్పించారు. రైతు సంక్షేమం, ఉచిత విద్యుత్, ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా ప్రోత్సాహం, సామాజిక న్యాయం వంటి రంగాల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజలనే తన కుటుంబంగా భావించి, వారి సంక్షేమమే పరమావధిగా జీవితాంతం కృషి చేసిన మహోన్నత ప్రజానాయకుడిగా ఆయనను కొనియాడారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారి ఆశయాలు, ప్రజాసేవ పట్ల ఆయన అంకితభావం, మానవతా దృక్పథం నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు.

వైఎస్సార్ కు ఉపముఖ్యమంత్రి భట్టి ఘన నివాళులు

హైదరాబాద్ పెన్ పవర్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత వై ఎస్ రాజశేఖర్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘనంగా నివాళుల్పించారు.

భట్టి మాట్లాడుతూ నమస్తే అక్కా, నమస్తే చెల్లి..." అంటూ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులని అన్నారు.

రైతు పక్షపాతిగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్, పేదల ప్రాణాలు నిలబెట్టిన 'ఆరోగ్యశ్రీ', నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన 'ఫీజు రీయింబర్స్ మెంట్', బీడు భూములకు ప్రాణం పోసిన 'జలయజ్ఞం'.. ఇలా ఆయన వేసిన ప్రతి అడుగు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నిజమైన 'ఇందిరమ్మ రాజ్యాన్ని' పేదవాడి గడప వరకు చేర్చిన ఆయన పాలన మాకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం. డు ఆయనతో కలిసి నడిచిన క్షణాలు, ఆయన వద్ద నేర్చుకున్న ప్రజాసేవా పాఠాలు నా రాజకీయ ప్రస్థానంలో ఎప్పటికీ మరువలేనివి. ఆ మహానేత ఆశయ సాధనకై మా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తూనే ఉంటుందని అన్నారు.

ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నంకీన్ కన్వేన్షన్

హైదరాబాద్ పెన్ పవర్: దేశంలోని రూ.1.5 లక్షల కోట్ల విలువైన మిఠాయి- నంకీన్ పరిశ్రమకు చెందిన అతిపెద్ద వ్యాపారాల్లో ఒక్కటైన వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్ (డబ్ల్యూఎంఎస్సీ) పర్చేజింగ్ ను ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో జరగనుంది. ఈ కన్వెన్షన్కు సంబంధించిన పోస్టర్ ను బంజారాహిల్స్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మ్యానఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ దీనిని ఆవిష్కరించి మాట్లాడారు. పండుగల సీజన్ కు ముందు దేశవ్యాప్తంగా తయారీదారులు, సరఫరాదారులు, రిటైలర్లను ఒకే వేదిక పైకి తీసుకురావడమే ఈ కన్వెన్షన్ లక్ష్యమని తెలిపారు. 'పర్ఫెక్ట్ స్టార్ట్ టుది ఫెస్టివ్ సీజన్' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ కన్వెన్షన్లో దేశవ్యాప్తంగా మిఠాయి, నంకీన్, బేకరీ, స్నాక్స్ రంగాలకు చెందిన తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, టెక్నాలజీ సంస్థలు, రిటైలర్లు పాల్గొననున్నట్లు వివరించారు.దేశంలోని రూ.1.5 లక్షల కోట్ల విలువైన మిఠాయి- నంకీన్ పరిశ్రమకు చెందిన అతిపెద్ద వ్యాపారాల్లో ఒక్కటైన వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్ (డబ్ల్యూఎంఎస్సీ) పర్చేజింగ్ ను ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో జరగనుంది. ఈ కన్వెన్షన్కు సంబంధించిన పోస్టర్ ను బంజారాహిల్స్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మ్యానఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ దీనిని ఆవిష్కరించి మాట్లాడారు. పండుగల సీజన్ కు ముందు దేశవ్యాప్తంగా తయారీదారులు, సరఫరాదారులు, రిటైలర్లను ఒకే వేదిక పైకి తీసుకురావడమే ఈ కన్వెన్షన్ లక్ష్యమని తెలిపారు. 'పర్ఫెక్ట్ స్టార్ట్ టుది ఫెస్టివ్ సీజన్' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ కన్వెన్షన్లో దేశవ్యాప్తంగా మిఠాయి, నంకీన్, బేకరీ, స్నాక్స్ రంగాలకు చెందిన తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, టెక్నాలజీ సంస్థలు, రిటైలర్లు పాల్గొననున్నట్లు వివరించారు.

అలక పాన్పు ఎక్కిన కొండా

వరంగల్, జూలై 8, పెన్ పవర్:
తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న రాజకీయ వైరం ఇప్పుడు అధికారికంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది.లంగాణ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తన శాఖలో ఎమ్మెల్యేల జోక్యాన్ని కొండా సురేఖ ఆమె ప్రస్తావించారు. తాను పర్యవేక్షిస్తున్న దేవాదాయ శాఖ లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షలు చేయడం ఏంటని లేఖలో ప్రశ్నించారు. మంత్రిత్వ శాఖలో ఎమ్మెల్యేల జోక్యం ఏమిటని కొండా సురేఖ నిలదీశారు. దీనిపై క్రమశిక్షణ కమిటీ చేత విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కడియం శ్రీహరి సమీక్షలు చేస్తూ... ఇతరులు సమీక్షలు చేయడం వల్ల మంత్రిత్వ శాఖలో గోప్యత ఉండదని, దాని వల్ల మంత్రులకే కాకుండా ప్రభుత్వానికి కూడా ఇబ్బందిగా మారతాయని కొండా సురేఖ రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఆదిలోనే తుంచి వేయకపోతే ప్రతి ఒక్కరూ ప్రతి మంత్రిత్వ శాఖలోజోక్యం చేసుకునే ప్రమాదం ఉందని కూడా కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనను పూర్తిగా విస్మరించి, తన శాఖా పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూలై 7, 2026 నాటి అధికారిక లేఖ ద్వారా ఆమె సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేస్తూ.. కడియం శ్రీహరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది.ఈ వివాదానికి అసలు కారణం.. జూలై 6వ తేదీన హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిర్వహించిన ప్రత్యేక సమావేశమే. మంత్రి సురేఖకు గానీ, ఆమె కార్యాలయానికి గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. కడియం శ్రీహరి నేరుగా దేవాదాయ శాఖ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని పలు దేవాలయాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. అంతేకాకుండా, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు, ఒక నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలంటూ అధికారులకు ఎమ్మెల్యే స్థాయిలోనే ఆదేశాలు జారీ చేయడంపై కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.మాస్టర్ ప్లాన్లు, అధికారుల కమిటీల ఏర్పాటు వంటివి పూర్తిగా శాఖా మంత్రి స్థాయిలో నిర్ణయించాల్సిన అంశాలు. ఒక ఎమ్మెల్యే ఇలా సమీక్ష చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయం. ఇది కేవలం పరిపాలనా లోపం కాదు, నా రాజ్యాంగబద్ధ అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే ప్రయత్నం అని కొండా సురేఖ లేఖలో సీఎంకు కుండబద్దలు కొట్టారు.

నా దేవాదాయ శాఖలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం సరికాదు

నాకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో కడియం శ్రీహరి సమీక్ష జరిపాడు

ప్రభుత్వ పరిపాలన వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన అంశం కాబట్టి...

ఈ లేఖ ద్వారా వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఉన్న పాత గ్రూపు రాజకీయాలు మరోసారి బట్టబయలయ్యాయి. గతంలో కూడా తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి నాపై దుష్ప్రచారం చేయించారని, ఆ కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయని సురేఖ నేరుగా సీఎంకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరికి పార్టీలో విపరీతమైన ప్రాధాన్యత ఇస్తూ.. కనీసం సీనియర్ మంత్రి అయిన తన శాఖలోనే జోక్యం చేసుకునేలా ప్రోత్సహించడంపై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది.దేవాదాయ శాఖ మంత్రికి సమాచారం లేకుండా ఎమ్మెల్యే ఎలా సమీక్ష నిర్వహిస్తారనే దానిపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన ప్రెస్ నోట్, ఫోటోలు, దినపత్రిక క్లిప్పింగులను కూడా సీఎంకు జతపరిచారు. ఒకవైపు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. సీనియర్ లీడర్లు అయిన కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య ఈ లేఖాస్త్రాల యుద్ధం ఎటు దారితీస్తుందో, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారో అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

కేటీఆర్ బ్యారేజ్ సవాల్ కు రేవంత్ 'కళరిపయట్టు'

హైదరాబాద్ పెన్ పవర్: గురి చూసి కొట్టే విషయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ టాలెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తనను లక్ష్యంగా చేసుకున్న వారికి.. సరైన సమయంలో సరైన రీతిలో సమాధానం చెప్పే విషయంలో ఆయన ట్రాక్ రికార్డు తిరుగులేనిదిగా చెప్పొచ్చు. తాజాగా అదే విషయాన్ని మరోసారి ప్రూవ్ చేశారు. అన్నింటికి మించి తన మీద ప్రయోగించిన అస్త్రాన్ని మధ్యలోనే అడ్డుకుంటూ.. ఆ అస్త్రాన్నే తనపై సంధించిన వారి మీద ప్రయోగించే అరుదైన యుద్ధకళ సీఎం రేవంత్ సొంతంగా చెప్పాలి.కేరళకు చెందిన యుద్ధ కళలో కళరిపయట్టు అనేది ఒకటి. దీని ప్రత్యేకత ఏమంటే..శత్రువు కత్తితో దాడి చేస్తే.. ఒక ప్రత్యేకమైన లయతో ఆ కత్తిని క్షణంలో వెయ్యో వంతులో లాగేసి.. అంతే వేగంగా తనపై ప్రయోగించిన ప్రత్యర్థిపై దూసే తీరును కళరిపయట్టుగా చెబుతారు. జపనీస్ యుద్ధ విద్య 'ఐకిడో' కూడా ఆ కోవకు చెందిందే. శత్రువు కత్తి..కర్ర లాంటి ఆయుధాలతో ప్రయోగిస్తే.. దాన్ని అడ్డుకోకుండా.. ఆ వచ్చే వేగాన్ని తమకు అనుగుణంగామార్చుకొని.. ఆయుధాన్ని ప్రయోగించిన వారి చేతిని మెలితిప్పి.. ఆ ఆయుధం వారి గుండెకే గుచ్చుకునేలా చేయటం ఈ విద్య లక్షణం.

అదే సమయంలో జపనీస్ యుద్ధ విద్య ఐకిడో తీరులోనూ సీఎం రేవంత్ తీరు ఉంటుందని చెబుతారు. ఈ యుద్ధ విద్యలో శత్రువు దాడి చేసేందుకు కత్తి.. కర్రతో వస్తే.. వారి చేతినో.. ఆయుధాన్నో అడ్డుకోకుండా.. వారి నుంచి దూసుకొచ్చే వేగాన్ని తమకు అనుగుణంగా మార్చుకొని.. వారి చేతిని మెలితిప్పి.. వారి ఆయుధం వారినే గాయపరిచేలా చేయటం. తాజా ఉదంతంలో రేవంత్ తీరు ఇదే రీతిలో ఉందని చెప్పాలి.

తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ తీరు ఇదే తరహాలో ఉంటుంది. తన రాజకీయ ప్రత్యర్థులు విసిరే విమర్శల ఆయుధాల్ని..ఆరోపణల అస్త్రాల్ని మధ్యలోనే అడ్డుకొని.. అంతే వేగంగా.. అంతకు మించిన ఒడుపుదనంతో తనపై ప్రయోగించిన వారిపైకే వెళ్లేలా ఆయన ఎత్తులు ఉంటాయి. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు తమకు అప్పగించాలని కోరుతూ ఆదివారం సవాలు విసిరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్ హౌస్ ను సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే వారం రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కు అప్పగించాలని.. కేవలం వారం రోజుల్లోనే గోదావరి నీటిని ఎత్తి పోసి తెలంగాణ మొత్తానికి నీళ్లు అందించి చూపిస్తామని సవాలు విసిరారు. లక్ష క్యూసెక్కుల గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి పోతుంటే, ఎగువన ఉన్న రిజర్వాయర్లు ఎండిపోతున్నా ప్రభుత్వం కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. దీనికి సీఎం రేవంత్ తాజాగా రియాక్టు అయ్యారు.కేటీఆర్ సవాలును స్వీకరిస్తూ.. తన బలమైన వాదనతో ప్రతి సవాలు విసిరారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలు.. విసిరిన ప్రతి సవాలు ఇప్పుడు కేసీఆర్ ను ఆత్మరక్షణలో పడేసేలా మారిందని చెప్పాలి. ఇందాక చెప్పినట్లుగా కేరళ.. జపనీస్ యుద్ధ విద్యల మాదిరి తనపై కాళేశ్వరం ప్రాజెక్టు అస్త్రాన్ని సంధించిన కేటీఆర్ కు.. దాన్ని మధ్యలోనే అడ్డుకొని కేసీఆర్ ను సీన్లోకి తెచ్చి.. కాళేశ్వరం ప్రాజెక్టును వారం ఎందుకు మూడేళ్లు అప్పగిస్తానని.. ఆ ఒక్క ప్రాజెక్టు మాత్రమే కాదు మూడు బ్యారేజీలను ఇస్తానంటూ విసిరిన సవాలు ఇప్పుడు సంచలనంగా మారింది.

తన ప్రతి సవాలుకు సీఎం రేవంత్ పెట్టిన కండీషన్లే కేసీఆర్ అండ్ కోకు కాస్తంత మింగుడుపడనివిగా మారతాయని చెప్పాలి. ఎందుకంటే..రేవంత్ పెట్టిన కండీషన్లు అలాంటివి.

1. కాళేశ్వరంపై చర్చ పెట్టాలని కోరుతూ కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలి

2. తనకు ఎందుకు బ్యారేజీలు అప్పగించాలో కేసీఆర్ సభకు చెప్పి మెప్పించగలిగితే మూడు బ్యారేజీలు అప్పగించటానికి అభ్యంతరం లేదు.

చూసేందుకు రెండు కండీషన్లుగా కనిపిస్తున్నప్పటికి.. వాటిని అంగీకరించటం కేసీఆర్ లాంటి అధినేతకు మామూలు విషయం కాదు. విపక్ష నేతగా అసెంబ్లీలోకి అడుగుపెట్టటం ఇష్టపడని కేసీఆర్.. ఎవరెన్ని సవాళ్లు విసిరినా రాని పరిస్థితి. అందునా.. కాళేశ్వరం ప్రాజెక్టు మీద సభలో చర్చ పెడితే.. సీఎం రేవంత్ తన బలమైన వాదనతో కేసీఆర్ అండ్ కో డిఫెన్స్ ను బలంగా తిప్పి కొట్టటానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నది మర్చిపోకూడదు.

ఏదో కేటీఆర్ సవాలుకు ప్రతి సవాలు మాదిరి కాకుండా..పక్కాగా హోంవర్కు చేసిన తర్వాతే సీఎం రేవంత్ ఈ తరహా ప్రతిసవాలుకు సిద్ధమైనట్లుగా చెప్పాలి. ఇందుకు సీఎం రేవంత్ చేసిన కొన్ని వ్యాఖ్యలు బలాన్ని చేకూర్చేలా ఉన్నాయని చెప్పాలి. "కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ వాదనలో బలం ఉంటే.. ఏ తప్పు చేయకుంటే సభకు రావాలి. ఉభయ సభల సంయుక్త సమావేశం పెట్టటానికైనా సిద్ధంగా ఉన్నాం.సాగునీటి నిపుణులను.. అడ్వకేట్ జనరల్ ను సభలోకి పిలిచి మరీ చర్చ పెడదాం" అని చెప్పటం ద్వారా.. తాను చెప్పే ప్రతి మాటకు తాను తయారుగా ఉన్నానన్న విషయాన్ని స్పష్టం చేశారని చెప్పాలి. అంతేకాదు.. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులను వినియోగిస్తున్నామని.. కేసీఆర్ కట్టిన సచివాలయాన్నికూడా వాడుకుంటున్నామన్న మాటతో.. ఆయన ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలన్నీ కొనసాగిస్తున్నట్లుగా చెప్పటం ద్వారా.. తాము ప్రతీకార రాజకీయాల్ని చేయటం లేదన్న విషయాన్ని స్పష్టం చేశారని చెప్పాలి. సీఎం రేవంత్ పొలిటికల్ కళరిపయట్టుకు గులాబీ బాస్ వద్ద ఎలాంటి సమాధానం ఉందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందని చెప్పక తప్పదు.

గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో ఓవైసీ వ్యూహం..

హైదరాబాద్, జూలై 8 పెన్ పవర్:
ఎం ఐ ఎం చీఫ్... అసదుద్దీన్ ఒవైసీ చాలా రోజుల తర్వాత హైదరాబాద్ లో చిచ్చు రాజేశాడు. సోషల్ మీడియా వేదికగా సౌత్, వెస్ట్ హైదరాబాద్ నుంచి అనేక ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు మార్చడం అన్యాయమని, ఇది సాధారణ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతోందని వ్యాఖ్యానించారు. గుడిమాల్కాపూర్ మార్కెట్ తరలింపును ఆధారంగా చేసుకుని, నగరంలోని వివిధ జోన్ల మధ్య వివక్ష ఉందనే పెద్ద అంశాన్ని తెరపైకి తెచ్చారు. పాతనగరం సౌత్ పరిధిలోకి, మెహదీపట్నం-కార్వాన్ పరిసరాలు వెస్ట్ పరిధిలోకి వస్తాయి. ఈ నిర్ణయాలు ప్రాంతాల మధ్య అసమానతను పెంచుతున్నాయని, స్థానికుల భావోద్వేగాలను రెచ్చగొట్టాడు.ఇటీవలి సంవత్సరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, శాంతిభద్రతను మెరుగుపరచడం, శివారు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన కార్యాలయాలు, విభాగాలను రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొత్త భవనాలకు, తూర్పు-ఉత్తర శివార్లకు మార్చింది. ఇందులో కలెక్టరేట్ సంబంధిత విభాగాలు, వక్ఫ్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయాలు, పోలీస్ నిర్వహణ కార్యాలయాలు, మార్కెటింగ్ శాఖ నోడల్ కార్యాలయాలు ఉన్నాయి. పాతనగరంలోని ఇరుకైన రోడ్లు, అధిక జనసాంద్రత వల్ల రోజూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. కొత్త ప్రాంతాల్లో విశాలమైన రోడ్లు, మెరుగైన కనెక్టివిటీ, ఆధునిక సౌకర్యాలు ఉండటం వల్ల పరిపాలన సౌలభ్యం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. శివార్ల అభివృద్ధి ద్వారా నగరం మొత్తం సమతుల్యంగా వృద్ధి చెందాలనేది లక్ష్యం.ఒవైసీ ఇలా జోన్ల వారీగా అసంతృప్తిని బయటపెడుతున్నారనేది బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయి. పాతనగరం ఎంఐఎంకు ఎప్పటి నుంచో బలమైన ఆధారం. అయితే వెస్ట్ జోన్‌లో ఐటీ కారిడార్ విస్తరణ వల్ల మెహదీపట్నం, కార్వాన్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో జనాభా మార్పులు పార్టీకి కొత్త సవాళ్లను తెస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగులు, కుటుంబాలు నివసించడం వల్ల స్థానిక సంప్రదాయ ఓటర్ల నిష్పత్తి మారుతోంది. ఈ ప్రాంతాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు లేదా వ్యాపార కేంద్రాలు శివార్లకు తరలిపోతే, స్థానిక మైనారిటీల ఆర్థిక వనరులు దెబ్బతినడమే కాక, చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు ప్రభావితమవుతారు. గుడిమాల్కాపూర్ వంటి సాంప్రదాయ మార్కెట్లు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవి. అందుకే ప్రభుత్వం సౌత్, వెస్ట్ హైదరాబాద్‌ను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందనే భావోద్వేగ అంశాన్ని ఉపయోగిస్తున్నారు.సాధారణ పరిపాలనా మార్పులను కూడా ప్రాంతీయ వివక్షగా చిత్రీకరించడం ద్వారా, పాతనగరంలోని కొత్త ఓటర్లను, వెస్ట్ హైదరాబాద్‌లోని వ్యాపార వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకం చేయాలనేది ఒవైసీ ప్రధాన ప్రణాళిక. నగర అభివృద్ధి అంతా హైటెక్ సిటీ లేదా ఉత్తర హైదరాబాద్ వైపు మాత్రమే జరుగుతోందని, సౌత్-వెస్ట్ ప్రాంతాలను పాలకులు వదిలేస్తున్నారని బలంగా ప్రచారం చేసి, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో తమ ఓటు బ్యాంకును రక్షించుకోవడానికి ఈ భౌగోళిక వ్యూహాన్ని అనుసరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విధానం ద్వారా స్థానిక సంఘాల్లో ఐక్యతను పెంపొందించి, ప్రత్యర్థి పార్టీల ప్రభావాన్ని తగ్గించాలనేది ఒవైసీ లక్ష్యంగా కనిపిస్తోంది.ఈ వివాదం మరింత రాజకీయ దుమారానికి దారితీసే అవకాశం ఉంది. స్థానిక సంఘాల నుంచి నిరసనలు, ప్రజా ఉద్యమాలు రావచ్చు. ఇదే సమయంలో ప్రభుత్వం మరోవైపు నగరం మొత్తం అభివృద్ధిని నొక్కి చెప్పి, తరలింపు నిర్ణయాలను సమర్థించవచ్చు. ఒవైసీ ఈ అంశాన్ని ఎక్కువగా ఉపయోగిస్తే, ఎన్నికల సమయంలో ఓటర్ల మధ్య చర్చలు ఎక్కువవుతాయి. ఈ చర్చ నగర అభివృద్ధి, ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ వ్యూహాల మధ్య సంబంధాన్ని స్పష్టం చేస్తోంది.

కొడంగల్ టూ శంషాబాద్ లైన్ క్లియర్

హైదరాబాద్, జూలై 8, పెన్ పవర్:
రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మక రేడియల్ రోడ్-2 నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పది రోజుల్లో భూములు సేకరించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. రైతులతో జరిపిన చర్చలు సఫలమవడంతో ఆర్‌ఆర్ యాక్ట్-2013 ప్రకారం పారదర్శక పరిహారానికి రైతులు అంగీకార పత్రాలు ఇచ్చారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 81 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారి వల్ల శంషాబాద్, షాద్‌నగర్ ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్లు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి.హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతికి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అత్యంత కీలకమైన రేడియల్ రోడ్-2 నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్లలో భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముట్‌పూర్, చుక్కమెట్, లాలాపేట్, ఉమ్మెత్యాల్, తుమ్మపల్లి గ్రామాల్లో ఈ రహదారి కోసం అవసరమైన భూములను రాబోయే పది రోజుల్లోనే పూర్తిస్థాయిలో సేకరించడానికి కసరత్తు ప్రారంభించారు.భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకున్నారు. రైతుల తరపున ప్రతినిధులతో ఉన్నత స్థాయి సంప్రదింపులు, ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ భూసేకరణ చట్టం ఆర్‌ఆర్ యాక్ట్-2013 నిబంధనల ప్రకారం పారదర్శకమైన పద్ధతిలో మార్కెట్ ధరకు అనుగుణంగా తగిన పరిహారాన్ని అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సానుకూల చర్చల అనంతరం భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతుల నుంచి అధికారులు అధికారిక అంగీకార పత్రాలను సేకరించారు.రేడియల్ రోడ్-2 ప్రాజెక్టును రాజధాని శివార్లలోని బుద్వేల్ నుంచి ప్రారంభించి షాబాద్, కొండూర్, పరిగి మీదుగా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ వరకూ మొత్తం 81 కిలోమీటర్ల మేర అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే శంషాబాద్, షాబాద్ మండలాలలో ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్లకు, కొత్తగా రాబోతున్న ఐటీ పరిశ్రమలకు అంతర్జాతీయ స్థాయి రవాణా సౌకర్యం లభించనుంది. ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కార్గో టెర్మినల్ నుంచి నేరుగా షాబాద్, కొడంగల్ ప్రాంతాలల్లోని భారీ పరిశ్రమలకు అవసరమైన భారీ యంత్రాలు, ముడిపదార్థాలు, విదేశీ పరికరాలను వేగంగా, సులభంగా తరలించడానికి ఈ మార్గం అనుకూలంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.రేడియల్ రోడ్-2 నిర్మాణం పూర్తికావడం ద్వారా శంషాబాద్-షాద్‌నగర్ ప్రాంతాల మధ్య సరికొత్త పారిశ్రామిక జోన్లు ఏర్పడేందుకు అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు కీలక ప్రాంతాల మధ్య కేవలం హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా మాత్రమే పరిమిత సంఖ్యలో పరిశ్రమలు నడుస్తున్నాయి. అయితే.. ఈ నూతన ఆర్‌ఆర్-2 రహదారి ద్వారా అంతర్గత ప్రాంతాలైన షాబాద్, షాద్‌నగర్ డివిజన్‌లోని కొండూరు, చౌదరిగూడ వంటి గ్రామీణ మండలాల్లోకి కూడా పారిశ్రామికీకరణ విస్తరిస్తుంది. దీనివల్ల మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన కనెక్టివిటీ లభించడమే కాకుండా, స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించి ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోనుంది.

భారీగా పెరగనున్న ఆస్తి పన్ను

హైదరాబాద్, జూలై 8, పెన్ పవర్:
హైదరాబాద్ మహానగర మున్సిపల్ పరిపాలనా వ్యవస్థలో గత ఏడు దశాబ్దాలలోనే ఎన్నడూ లేనంతటి అతిపెద్ద సంస్కరణకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1955 నాటి పాత జీహెచ్ఎంసీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తూ.. మారుతున్న కాలం, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా సరికొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా ది డ్రాఫ్ట్ కోర్ అర్బన్ రీజియన్ బిల్, 2026 ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. క్యూర్ బిల్లుగా పిలుస్తున్న ఈ మార్పును హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పౌర సేవలను మరింత వేగవంతం చేయడానికి, పరిపాలనను ఆధునీకరించడానికి ఈ చారిత్రాత్మక బిల్లును రూపకల్పన చేసినట్లుగా చెబుతున్నారు.హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ , సైబరాబాద్ , మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఒకే సమగ్ర పరిపాలనా చట్టం కిందికి తీసుకురావడం. ప్రస్తుతం నగరంలో అర్బన్ ప్లానింగ్, రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రవాణా, ప్రజారోగ్యం, విపత్తు నిర్వహణ వంటి సేవలను వేర్వేరు విభాగాలు చూస్తుండటంతో సమన్వయ లోపం ఏర్పడుతోంది. ఈ కొత్త చట్టం ద్వారా ఈ విభాగాలన్నింటినీ అనుసంధానించనున్నారు. తద్వారా ప్రాజెక్టుల అమలు వేగవంతం కావడమే కాకుండా పౌరులకు నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం అమల్లో ఉన్న యాన్యువల్ రెంటల్ వాల్యూ ఆధారిత ఆస్తి పన్ను విధానానికి ఈ బిల్లు స్వస్తి పలకనుంది. దీని స్థానంలో మార్కెట్ రేట్లకు అనుగుణంగా ఉండే క్యాపిటల్ వాల్యూ ఆధారిత సరికొత్త ఆస్తి పన్ను అసెస్‌మెంట్ నమూనాను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఒక స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. వీటితో పాటు జీఐఎస్ ఆధారిత అర్బన్ ప్లానింగ్, భూగర్భ యూటిలిటీల సమగ్ర

నిర్వహణ, ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పౌర సేవలు, సులభతర వాణిజ్యం లో భాగంగా సింగిల్ ట్రేడ్ లైసెన్స్ విధానం, సరళీకృత భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ వంటి కీలక సంస్కరణలను ఇందులో పొందుపరిచారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే భవనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సకాలంలో పన్నులు చెల్లించే వారికి రిబేటులు కూడా ఇవ్వనున్నారు.ఈ డ్రాఫ్ట్ జఖ=జు బిల్-2026 ను ప్రజల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. హైదరాబాద్ నివాసితులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, నిపుణులు, పారిశ్రామిక రంగానికి చెందిన ప్రముఖులు ఈ ముసాయిదాను పరిశీలించి, తమ విలువైన సలహాలు, సూచనలను జూలై 24, 2026 లోగా

సమర్పించాలని జీహెచ్ఎంసీ కోరింది. అధికారిక జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ ఫీడ్‌బ్యాక్‌ను పంపవచ్చని, వచ్చిన సూచనలను నిశితంగా పరిశీలించిన తర్వాతే బిల్లుకు తుది రూపునిచ్చి అసెంబ్లీలో ప్రవేశపెడతామని ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ బిల్లు నగర పాలనలో కొత్త మార్పు తీసుకు రానుంది.

హైదరాబాద్ కు క్యూ కడుతున్న ఇంటర్నేషనల్ వర్శిటీలు..

హైదరాబాద్, జూలై 8, పెన్ పవర్:
తెలంగాణ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 15 విదేశీ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ యూజీసీకి దరఖాస్తు చేసుకోగా.. మరికొన్ని వర్సిటీలు సంప్రదింపులు జరుపుతున్నాయి. ఈ విదేశీ క్యాంపస్‌ల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడంతో పాటు, మేధో వలసలు తగ్గి స్థానికంగానే ఉద్యోగ, పరిశోధన అవకాశాలు లభించనున్నాయి.ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ రంగాల్లో అంతర్జాతీయంగా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం త్వరలోనే అంతర్జాతీయ ఉన్నత విద్యా రంగానికి కూడా గ్లోబల్ హబ్‌గా మారబోతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం 2020తో పాటు, యూజీసీ ప్రకటించిన నూతన సడలింపులు భారత్‌లో విదేశీ వర్సిటీల ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేశాయి. ఈ అనుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుంటూ వివిధ దేశాలకు చెందిన సుమారు 15 ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి క్యూ కడుతున్నాయి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఉన్న అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతలు, నివాసయోగ్యమైన వాతావరణం అంతర్జాతీయ సంస్థలను ఇటువైపు ఆకర్షిస్తున్నాయి.ఇప్పటికే ఈ ప్రక్రియలో భాగంగా అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ క్యాంపస్‌ల ఏర్పాటు కోసం యూజీసీకి అధికారికంగా దరఖాస్తులు కూడా చేసుకున్నాయి. ప్రస్తుతానికి ఈ విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేట్ భాగస్వామ్యంతోనే స్వతంత్ర ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ఒక ప్రముఖ వర్సిటీ వచ్చే విద్యాసంవత్సరం నుంచే క్లాసులు ప్రారంభించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఐటీ కారిడార్ గచ్చిబౌలిలోని ఒక భారీ కమర్షియల్ టవర్‌లో కొన్ని అంతస్తులను లీజుకు తీసుకునేందుకు ప్రభుత్వ వర్గాలతో చర్చలు జరుపుతోంది. తాత్కాలికంగా ఇక్కడ ప్రారంభించి భవిష్యత్తులో ప్రయోగశాలలు, స్పోర్ట్స్ అకాడమీలతో కూడిన శాశ్వత క్యాంపస్‌ల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది.మరికొన్ని టాప్ వర్సిటీలు కూడా క్యాంపస్‌ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికాకు చెందిన పర్డ్యూ యూనివర్సిటీ, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధులు ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారులతో ప్రాథమిక సంప్రదింపులు పూర్తి చేశారు. అదేవిధంగా.. యూకేకు చెందిన బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ఇక్కడ ప్రత్యేకంగా క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. వీటితో పాటు న్యూ కాజిల్ యూనివర్సిటీ, చిచెస్టర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హెర్ట్‌ఫోర్డ్‌షైర్, న్యూజిలాండ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ వైకాటో ప్రతినిధులు కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి తమ ప్రతిపాదనలను సమర్పించారు.తెలంగాణ నుంచి ప్రతి సంవత్సరం ఉన్నత చదువుల కోసం వేల సంఖ్యలో విద్యార్థులు కోట్లాది రూపాయల ధనాన్ని వెచ్చించి అమెరికా, యూకే, కెనడా వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. అంతర్జాతీయ స్థాయి విద్య ఇక్కడే అందుబాటులోకి రావడం వల్ల అక్కడకు వెళ్లే అవసరం ఉండదు. ఈ క్యాంపస్‌ల నిర్మాణాల ద్వారా రాష్ట్రంలోకి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రానున్నాయి. అంతేకాకుండా, బోధన, బోధనేతర రంగాల్లో, ఐటీ సపోర్ట్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలలో స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పరిశ్రమలకు సమీపంలో ఈ క్యాంపస్‌లు ఉండటం వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ కార్పొరేట్ ప్రాజెక్టులు సులభంగా దక్కుతాయి.పరిశోధనల విషయానికొస్తే, విదేశీ వర్సిటీలు కేటాయించే భారీ రీసెర్చ్ ఫండ్స్ స్థానిక పీహెచ్‌డీ విద్యార్థులకు వరంగా మారనున్నాయి. హైదరాబాద్‌లోని ఐఐటీ, బిట్స్ పిలానీ, సెంట్రల్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి ఈ గ్లోబల్ వర్సిటీలు సంయుక్త పరిశోధనలు చేపట్టే అవకాశం ఉంది.

సెంటిమెంట్ తో కమలం వ్యూహం...

హైదరాబాద్, జూలై 8, పెన్ పవర్: తెలంగాణ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై పట్టు సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణ పర్యటన తర్వాత కొంత నేతల్లో సమన్వయం కనిపిస్తుంది. అలాగే సెంటిమెంట్ ను రగిలించాలని బీజేపీ నేతలు ఈ ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు అర్థమవుతుంది. తాజాగా బీజేపీ రాష్ట్ర నేతలు ఎంఐఎం, హైడ్రా ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. బీజేపీ చేస్తున్న విమర్శలకు ఎంఐఎం ప్రతి విమర్శలు చేస్తూ కమలం పార్టీ ట్రాప్ లో పడినట్లు కనిపిస్తుంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే పతంగి పార్టీ విమర్శలతో బీజేపీ ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.. హైడ్రాను ముందర పెట్టి బీజేపీ విమర్శలకు గత కొద్ది రోజులుగా దిగుతోంది. హైడ్రా కేవలం సామాన్యులు, పేదలు జోలికి మాత్రమే పోతుందని, ఎంఐఎం నేతల ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని ఆరోపిస్తుంది. బీజేపీ చీఫ్ రామ్ చందర్ రావు తో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కూడా హైడ్రాపై వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, ఎంఐఎంకు చెందిన ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. ఫాతిమా కళాశాలను ఆక్రమించి నిర్మించారని, దానిని కూల్చివేయడంలో హైడ్రా అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారని ప్రశ్నించారు. కేవలం పేదల ఇళ్లను కూల్చివేయడానికే హైడ్రాను ఏర్పాటు చేసినట్లుందని అభిప్రాయపడ్డారు. హైడ్రా కొందరి నిర్మాణాలనే కూల్చివేస్తుందని, హైకోర్టు ఎన్ని తీర్పులు చెప్పినా హైడ్రా మాత్రం తన వైఖరిలో మాత్రం మార్పు తీ రావడం లేదని బీజేపీ నేతలు అంటున్నారు.. దీనికి ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. తమను భయపెట్టాలని కొందరు చూస్తున్నారని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. బెదిరింపులకు లొంగేది లేదని అన్నారు. ఎంఐఎంకు చెందిన విద్యాసంస్థలను కూల్చివేస్తామని కొందరు బెదిరిస్తున్నారని, కానీ ఇలాంటి బెదిరింపులకు తాము భయపడేది లేదని తెలిపారు. ఫాతిమా కళాశాలపై ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పందించారు. తమ విద్యాసంస్థను ఎలా కాపాడు కోవాలో తమకు తెలుసునని అన్నారు. ఒక విద్యాసంస్థను కూల్చివేస్తే వంద విద్యాసంస్థలు నిర్మిస్తామని అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పారు. తమను బెదిరించి లొంగదీసుకోవాలని భావించడం అవివేకమని అన్నారు. దీంతో గ్రేటర్ ఎన్నికల వేళ సెంటిమెంట్ రగిలి హైదరాబాద్ మున్సిపల్ నగర పరిధిలో ఎక్కువ ఓటు బ్యాంకును సొంతం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి బీజేపీ ఈ వ్యూహంతో ఎన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందన్నది చూడాల్సి ఉంది.

‘ట్రైన్ టు బుసాన్’.. లోకేశ్ ఇంట్రెస్టింగ్ ట్వీట్

హైదరాబాద్ పెన్ పవర్: టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. ఇంకా చెప్పాలంటే టెక్నాలజీ వాటడంలో ఆయన ఇతర నేతలు కంటే ముందుంటారు. అదేవిధంగా ఎంటరటైన్మెంట్, స్పోర్ట్స్ ల్లో పరకాయ ప్రవేశం చేస్తూ తనను తాను ప్రత్యేకంగా ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తుంటారు. తన అధికారిక పర్యటనలు, పర్సనల్ విశేషాలు, రాష్ట్రాభివృద్ధికి చెందిన ముఖ్య సమాచారం ఎక్కువగా సోషల్ మీడియా ద్వారానే వెల్లడిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం మంత్రి లోకేశ్ చేసిన ఒక ట్వీట్ వైరల్ అవుతోంది. బిజినెస్ మేన్ లా స్టైలిష్ లుక్ లో ఉన్న ఫొటోలతోపాటు దక్షిణ కొరియాలో సహచరులతో కలిసి ట్రైనులో జర్నీ చేస్తున్న ఫొటోలను మంత్రి తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఈ పోస్టులో ఈ రోజు దక్షిణకొరియాలో భిన్నమైన ప్రయాణం చేస్తున్నాను అంటూ తెలియజేస్తూ “ట్రైన్ టు బుసాన్” అనే ప్రఖ్యాత చిత్రాన్ని గుర్తు చేశారు. కొరియన్ చిత్రమైన ‘ట్రైన్ టు బుసాన్’ అత్యంత ప్రసిద్ధమైన యాక్షన్–హారర్ సినిమా. ఈ పేరు తెలియని వారు ఉండరని అంటారు. దీంతో తన పర్యటన విశేషాలను తెలియజేసేందుకు లోకేశ్ తెలివిగా ఆ చిత్రం పేరును వాడుకుని అందరిలో ఒక రకమైన కుతూహలం పెంచేశారు. రాష్ట్రాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే బలమైన సంకల్పంతో మంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్కడ పారిశ్రామిక వర్గాలతో చేపడుతున్న చర్చల వివరాలను వెల్లడించేందుకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొరియన్ చిత్రం ‘ట్రైన్ టు బుసాన్’ పేరును గుర్తు చేస్తూ సియోల్ నుండి బుసాన్ నగరానికి రైలులో ప్రయాణిస్తున్న ఫొటోలను షేర్ చేశారు. బ్లాక్ సూట్, అత్యంత ప్రొఫెషనల్ లుక్ ఉన్న ఫొటోలను జతచేయడంతో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

అపెక్స్–కొరియా ప్రారంభం

మంత్రి లోకేష్ తన పర్యటనను కేవలం పలకరింపులకే పరిమితం చేయకుండా, పెట్టుబడుల ఆకర్షణకు బలమైన పునాదులు వేస్తున్నారు. బుసాన్‌లో ఆయన ‘అపెక్స్–కొరియా’ కేంద్రానికి శ్రీకారం చుట్టినట్లు ఎక్స్ లో ప్రకటించారు. ఇది ఆంధ్రప్రదేశ్, దక్షిణ కొరియా మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేయడమే కాకుండా, కొరియన్ పెట్టుబడిదారులకు ఏపీలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడానికి ఒక సింగిల్ విండో వ్యవస్థగా పనిచేస్తుందని తెలిపారు. ఈ ప్రయత్నం ఏపీని కొరియన్ పారిశ్రామిక దిగ్గజాలకు ప్రధాన గమ్యస్థానంగా మార్చే దిశగా వేసిన కీలక అడుగు అని పరిశ్రమల నిపుణులు భావిస్తున్నారు.

దిగ్గజ సంస్థలతో వరుస సమావేశాలు

తన పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ వరుసగా అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల అధిపతులతో సమావేశమవుతున్నారు. ముఖ్యంగా 101.9 బిలియన్ డాలర్ల భారీ ఆస్తులు కలిగిన బీఎన్–కే ఫైనాన్షియల్ గ్రూప్‌తో ఆయన జరిపిన చర్చలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమరావతి రాజధానిలో తమ కార్యకలాపాలను ప్రారంభించాల్సిందిగా మంత్రి ఆ సంస్థను కోరారు. ఇది మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అమరావతి అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని చెబుతున్నారు. అలాగే, బూయాంగ్ గ్రూప్, హ్యూంగ్ సాంగ్ గ్రూప్ వంటి సంస్థల ప్రతినిధులతో కూడా ఆయన భేటీ కానున్నారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన పర్యటన

ఈ పర్యటన కేవలం సమావేశాలకే పరిమితం కాలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి క్షేత్రస్థాయిలో పారిశ్రామిక అనుభవాలను తెలుసుకోవడానికి కూడా లోకేష్ ప్రాధాన్యతనిస్తున్నారు. కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, ఏపీలోని సముద్ర ఆధారిత పరిశ్రమల విస్తరణపై చర్చించనున్నారు. అలాగే, స్థానిక షూ ఫ్యాక్టరీని సందర్శించి, కొరియన్ తయారీ రంగంలోని పద్ధతులు, టెక్నాలజీ గురించి తెలుసుకోనున్నారు. ఐటీ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రపంచస్థాయి సంస్థలను ఏపీకి తీసుకురావడమే ధ్యేయంగా మంత్రి లోకేష్ చేస్తున్న ఈ పర్యటన రాష్ట్రానికి ఏ మేరకు ఫలితాలను అందిస్తుందో వేచి చూడాలి.

ఎంజీ యూనివర్సిటీలో విద్యార్థినుల ఆందోళన

నల్గొండ పెన్ పవర్: నల్గొండ పట్టణంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థినిలు అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. హాస్టల్ బాత్ రూముల్లో నీటి కొరత ఉందంటూ వీసీ నివాసం ముట్టడించారు. రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. వీసీ బయటకు వచ్చే వరకు కదిలేది లేదన్నారు. రెండు గంటలుగా వీసీ నివాసం ఎదుటే విద్యార్థినుల బైఠాయించారు. విద్యార్థినుల నిరసనకు ఏబీవీపీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. క్యాంపస్ లోకి అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులను పిలిపించడం ఏంటని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో? విద్యార్థినిలు యూనివర్సిటీ అధికారులు, పోలీసులతో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు.

పవన్ కళ్యాణ్ అభిమాని చిన్నారి నిరంజన్ కన్నుమూత

హైదరాబాద్ పెన్ పవర్: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమాని చిన్నారి నిరంజన్ మృతి చెందాడు. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ చివరి కోరికను పవన్ కళ్యాణ్ నెరవేర్చిన సంగతి తెలిసిందే. గత నెల 17న హన్మకొండకు వెళ్లి బాలుడిని పవన్ కళ్యాణ్ పరామర్శించారు. మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి బాలుడు నిరంజన్ మృతి చెందాడు.

ఎల్లారెడ్డిపల్లిలో చిరుత కలకలం

హైదరాబాద్ పెన్ పవర్: ఎల్లారెడ్డి పల్లిలో చిరుత సంచారం కలకలం రేపింది. మంగళవారం అర్ధరాత్రి చిరుత శ్రావణ్ అనే రైతు పౌల్ట్రీ ఫామ్ లోకి దూరింది. చిరుత తిరుగుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో చిక్కాయి. కుక్కలు అరవడంతో చిరుత వెనుదిరిగి వెళ్లిపోయింది.

ఉగ్రామ్ అద్భుతం... తెలంగాణ స్టార్టప్ రెడీ

హైదరాబాద్, జూలై 8 పెన్ పవర్: తెలంగాణకు చెందిన రక్షణ స్టార్టప్ ‘ద్వీప డిఫెన్స్’ డీఆర్డీవోతో కలిసి అద్భుతం చేసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వదేశీ ఆయుధాల తయారీపై డీఆర్డీవో దృష్టి పెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్రం కూడా రక్షణ బడ్జెట్ పెంచింది. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన స్టార్టప్ 7.62ఐ51 ఎంఎం క్యాలిబర్‌లో ఉగ్రం అనే దేశీ రైఫిల్‌ను అభివృద్ధి చేసింది. ఈ ప్రాజెక్టును కేవలం 100 రోజుల్లోనే డిజైన్ చేసి, నమూనా తయారు చేయడం రక్షణ రంగంలో వేగాన్ని పెంచింది. సాధారణంగా ఆయుధాల అభివృద్ధికి సంవత్సరాలు పట్టే పరిస్థితుల్లో ఈ వేగం ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి బలం చేకూర్చుతోంది.ఉగ్రమ్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్వహించిన కఠినమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఈ రైఫిల్‌ను తమ ఆయుధభండారంలో చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. సాధారణంగా విదేశీ ఆయుధాలపై ఆధారపడే సీఏపీఎఫ్‌కు దేశీ రైఫిల్ అందుబాటులోకి రావడంతో ఖర్చు తగ్గడం, సరఫరా భద్రత పెరగడం, నిర్వహణ సౌలభ్యం వంటి ప్రయోజనాలు ఏర్పడతాయి.డీఆర్డీవోకి చెందిన ఆయుధ పరిశోధన, అభివృద్ధి సంస్థతో స్టార్టప్ సంయుక్తంగా పని చేయడంతో ఈ వేగం సాధ్యమైంది. ప్రైవేట్‌రంగ స్టార్టప్‌లు తమ సౌలభ్యం, ఆవిష్కరణ సామర్థ్యం, త్వరిత నిర్ణయాలతో డీఆర్డీవో సాంకేతిక నైపుణ్యాన్ని మిళితం చేస్తున్నాయి. ఇది రక్షణ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ఎంత ముఖ్యమో చాటుతోంది. 100 రోజుల్లో డిజైన్ నుంచి నమూనా వరకు పూర్తి చేయడం భవిష్యత్తులో అత్యవసర అవసరాలకు త్వరితంగా స్పందించే సామర్థ్యాన్ని నిరూపిస్తోంది.ఈ విజయం రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. సీఏపీఎఫ్‌కు వంటి పెద్ద సంఖ్యలో ఆయుధాలు అవసరమయ్యే బలగాలకు స్థానికంగా ఉత్పత్తి అయ్యే రైఫిల్‌లు అందుబాటులోకి రావడం వల్ల దేశీయ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

పవన్ వీరాభిమాని మృతి

వరంగల్, జూలై 8 పెన్ పవర్:
అభిమానిని కలవడానికి స్టార్ హీరోగా కాదు.. అప్తుడిలా అతడి ఇంటి గుమ్మం దాటారు పవన్ కళ్యాణ్. మంచానికే పరిమితమైన ఆ బాలుడి చేతిని పట్టుకుని ధైర్యం చెప్పారు. “మనిద్దరం కలిసి OG సినిమా చూద్దాం.. OG 2 వస్తే నువ్వే నా స్పెషల్ గెస్ట్” అని ప్రేమగా మాటిచ్చారు. కానీ ఆ కల నిజమయ్యేలోపే.. ఆ అభిమాని ఈ లోకాన్ని విడిచిపెట్టాడు.హనుమకొండ హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల పొనుగంటి నిరంజన్ గత కొంతకాలంగా అరుదైన న్యూరోమస్క్యులర్ జన్యు వ్యాధితో పోరాడుతున్నాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరిన అతడి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించింది. వైద్యుల ప్రయత్నాలు ఫలించక బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. ఈ వార్తతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.నిరంజన్‌కు పవన్ కళ్యాణ్ అంటే ప్రాణం. పవన్ పాటలు, డైలాగ్‌లతో చేసిన అతడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ విషయం పవన్ దృష్టికి చేరింది. వెంటనే జూన్ 17న స్వయంగా అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొద్దిసేపు అతడి పక్కనే కూర్చుని మాట్లాడారు. ప్రేమగా హత్తుకుని ధైర్యం చెప్పారు. “అందరూ నన్ను ‘చోటా గబ్బర్ సింగ్’ అని పిలుస్తారు” అని నిరంజన్ చెప్పినప్పుడు పవన్ కూడా చిరునవ్వుతో ఆనందం వ్యక్తం చేశారు.వెళ్లే ముందు బహుమతులు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తూ త్వరలో మళ్లీ కలుద్దామని చెప్పారు. తనకు కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా.. ఆరోజే కుక్క పిల్లను అందించారు. అయితే ఆ ఆప్యాయ భేటీ జ్ఞాపకంగా మిగిలిపోగా.. కొన్ని రోజులకే నిరంజన్ మృతి చెందడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. ఒక అభిమాని చివరి కోరికను నెరవేర్చాలని కోరుకున్న హీరో.. ఇప్పుడు అదే అభిమానిని కోల్పోవాల్సి రావడం అభిమానులను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
‘పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

తెలంగాణ రాజకీయాల్లో ‘దేవాదాయ’ కాక.. సీఎం వద్దకు చేరిన సురేఖ-కడియం వివాదం

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. తన శాఖ వ్యవహారాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం చేసుకుంటున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మంత్రి కొండా సురేఖ సీఎంకు ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ముఖ్యమంత్రికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

దేవాదాయ, అటవీ శాఖల మంత్రిగా ఉన్న కొండా సురేఖ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక అధికారిక లేఖ రాశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనకు కనీస సమాచారం ఇవ్వకుండా తన ప్రమేయం లేకుండా దేవాదాయ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారని ఆరోపించారు. “ప్రభుత్వ పరిపాలనా నిబంధనలైన ‘రూల్స్ ఆఫ్ బిజినెస్’ ప్రకారం ఒక శాఖపై సమీక్ష నిర్వహించే అధికారం సంబంధిత మంత్రికి లేదా ముఖ్యమంత్రికి మాత్రమే ఉంటుంది. కానీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి అధికారులతో భేటీ అయ్యారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి” అని మంత్రి కొండా సురేఖ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

“నేనేం తప్పు చేయలేదు” కౌంటర్ ఇచ్చిన కడియం శ్రీహరి..

మంత్రి కొండా సురేఖ చేసిన ఫిర్యాదుపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటుగానే స్పందించారు. ఈ వివాదంపై మీడియాతో మాట్లాడిన ఆయన.. తనపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండించారు. తాను ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, ఒక ప్రజాప్రతినిధిగా తన పరిధిలోనే పనిచేశానని స్పష్టం చేశారు.

కడియం శ్రీహరి మాట్లాడిన ముఖ్యమైన అంశాలు..

సమీక్ష నిర్వహించలేదని.. దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదనే విషయం ఒక సీనియర్ నాయకుడిగా తనకూ తెలుసని, తాను అధికారులను పిలిపించి సమీక్ష పెట్టలేదని చెప్పారు. తన నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తాను స్వయంగా దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చానని వివరించారు. “నా వద్దకు అధికారులను పిలిపించి భేటీ పెడితే దాన్ని సమీక్ష అంటారు. కానీ నేను కమిషనర్ ఆఫీస్‌కు వెళ్లి కలిశాను. ప్రజా సమస్యల కోసం అధికారులను కలవడం సహజం. నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టి ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు” అని తేల్చి చెప్పారు.

“కొత్త అలవాట్లు నేర్చుకుంటున్నారు” అంటూ పరోక్ష చరకలు

ఈ వివాదంలో ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండానే కడియం శ్రీహరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొందరు రాజకీయాల్లో “కొత్త అలవాట్లు” నేర్చుకుంటున్నారని.. అనవసర వివాదాలు సృష్టిస్తూ ప్రజల మధ్య ఉండేందుకు ప్రయత్నిస్తున్నారని పరోక్షంగా మంత్రి కొండా సురేఖను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అవసరమైతే ఈ పూర్తి వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వాస్తవాలను వివరిస్తానని ఆయన పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఏం చేయబోతున్నారు?

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు కీలక నేతల మధ్య రేగిన ఈ వివాదం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో సరికొత్త చర్చకు దారితీసింది. మంత్రి సురేఖ ఫిర్యాదు, దానికి కడియం శ్రీహరి ఇచ్చిన కౌంటర్‌తో ఈ వ్యవహారం మరింత ముదిరేలా కనిపిస్తోంది. పార్టీలో, ప్రభుత్వంలో ఇమేజ్ దెబ్బతినకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, ఇరు నేతలను ఎలా సమన్వయపరుస్తారు అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.

జడ శ్రవణ్ డబ్బులెలా వస్తున్నాయి.. కలకలం రేపుతున్న వీడియో

గుంటూరు, జూలై 8, పెన్ పవర్:
నిజమే.. మీరు చదివింది ముమ్మాటికి నిజమే. ఇదేదో మేము చేస్తున్న ఆరోపణ కాదు. నేను కావాలని స్ప్రెడ్ చేస్తున్న ఫ్యాబ్రికేటెడ్ న్యూస్ అంతకంటే కాదు. ఈ విషయాన్ని స్వయంగా జడ శ్రావణ్ చెప్పారు. అది రికార్డు అయింది. యూట్యూబ్ ద్వారా బయటికి వచ్చింది. రకరకాల చర్చలకు కారణమైంది. అంతేకాదు, జడ శ్రవణ్ అసలు రంగు బయటపడుతోంది.కొద్దిరోజులుగా ఏపీ రాజకీయాలలో జడ శ్రవణ్ గురించి పెద్ద ఎత్తున చర్చ నడుస్తుంది కదా.. పైగా ఆయన ఓ మీటింగ్లో పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి.. పది ఫెయిల్ అయిన నువ్వు డిప్యూటీ సీఎం అవ్వంగా లేంది.. జడ్జి చదువుకున్న నేను డిప్యూటీ సీఎం కాకూడదా అంటూ ప్రశ్నించారు. వాస్తవానికి జడ్జి అనేది ఒక చదువు కాదు. అది ఒక ఉద్యోగం మాత్రమే. అనుభవం ద్వారానే అది ఇస్తారు. ఆ విషయాన్ని మర్చిపోయి శ్రవణ్ మాట్లాడారు. జనసేన నాయకుల చేతిలో తీవ్రస్థాయిలో విమర్శలకు గురయ్యారు. జడ శ్రవణ్ ఎప్పుడైతే ఆ విమర్శ చేశారో.. అప్పట్నుంచి జన సైనికుల చేతిలో తీవ్రస్థాయిలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జడ శ్రవణ్ గురించి జనసేన నాయకులు కొత్త కొత్త వీడియోలు బయటపెడుతున్నారు.జనసేన నాయకులు బయటపెట్టిన వీడియోలలో ఒకటి మాత్రం సంచలనం కలిగిస్తోంది. ఆ వీడియో సోషల్ మీడియాలో బ్లాస్టింగ్ కు కారణమవుతోంది. ఆ వీడియోలో జడ శ్రవణ్ జగన్ గురించి చెప్పారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆయన మీద కేసులు వేయడానికి దాదాపు 25 కోట్ల వరకు శ్రావణ్ ఖర్చు పెట్టారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 500 కేసులు వేశానని శ్రావణ్ చెప్పుకొచ్చారు. దళిత వైద్యుడు సుధాకర్ చనిపోయినప్పుడు.. దళితుల హత్యలు జరిగినప్పుడు శ్రావణ్ ఏనాడు కూడా బయటికి రాలేదు. కనీసం బాధితుల తరపున స్వరం కూడా వినిపించలేదు. అటువంటి వ్యక్తి 25 కోట్లు ఖర్చుపెట్టి 500 కేసులు వేసాడు అంటే నమ్మశక్యంగా లేదని జనసేన నాయకులు

అంటున్నారు.తన వ్యక్తిగత జీవితంలో నిజాయితీని మాత్రమే నమ్ముకున్నానని పదేపదే చెప్పే శ్రావణ్.. 25 కోట్లు ఎలా ఖర్చు పెట్టారని.. ఆ నగదు ఎలా సమీకరించారని జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు. పాటికి పదిసార్లు పవన్ కళ్యాణ్ ను విమర్శించే శ్రావణ్.. తాను 25 కోట్లు ఏ రూపంలో సంపాదించారో చెప్పాలని అడుగుతున్నారు. ఒక జడ్జిగా ప్రభుత్వం ఆయనకు అనేక రకాల సదుపాయాలు కల్పిస్తుందని.. జీతం కూడా భారీగానే ఇస్తుందని.. ఎంతటి భారీ జీతం ఇచ్చినప్పటికీ ఆ స్థాయిలో నగదు ఎలా సమీకరిస్తారని జనసేన నాయకులు అడుగుతున్నారు. మరి దీనికి జడ శ్రావణ్ ఎలాంటి సమాధానం చెప్తారో చూడాలి

కాక్ రోచ్ ఈజ్ బ్యాక్

హైదరాబాద్, జూలై 8 పెన్ పవర్:
సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన ‘కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీజేపీ ఎక్స్ ఖాతాను బ్లాక్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. నీట్ పునఃపరీక్ష పూర్తయిన నేపథ్యంలో ఖాతాను బ్లాక్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.ఈ కేసును జస్టిస్ స్వర్ణ కాంత శర్మ విచారించారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ రీ–ఎగ్జామినేషన్ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం తలెత్తకుండా ఉండేందుకే సీజేపీ ఎక్స్ ఖాతాను తాత్కాలికంగా బ్లాక్ చేసినట్లు కోర్టుకు తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు హాజరయ్యే జాతీయ స్థాయి పరీక్ష సమయంలో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే పోస్టులు పరీక్ష నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం భావించిందని వివరించారు.కేంద్రం జారీ చేసిన బ్లాకింగ్ ఉత్తర్వును సవాల్ చేస్తూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫు న్యాయవాదులు, సోషల్ మీడియా ఖాతాను నిలిపివేయడం భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని వాదించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు, ప్రస్తుత పరిస్థితుల్లో ఖాతాను బ్లాక్ చేయడానికి ఎలాంటి కారణం లేదని తేల్చింది. నీట్ పునఃపరీక్ష ఇప్పటికే పూర్తయినందున కేంద్రం వ్యక్తం చేసిన ప్రాథమిక ఆందోళనకు ఇప్పుడు ప్రాధాన్యం లేదని పేర్కొంది.

కొనసాగుతున్న సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష

మరోవైపు, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కూడా కొనసాగుతోంది. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనకారులు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయన బరువు 7.3 కిలోలు తగ్గినట్లు తాజా వైద్య నివేదికల్లో పేర్కొన్నారు. రక్తపోటు 102/61 ఎంఎంహెచ్‌జీగా, రక్తంలో గ్లూకోజ్ స్థాయి 68 ఎంజీ/డీఎల్‌గా నమోదైనట్లు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని నిర్వాహకులు వెల్లడించారు.దీర్ఘకాల నిరాహార దీక్ష ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నప్పటికీ, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు తాజా తీర్పుతో సీజేపీ ఎక్స్ ఖాతా పునరుద్ధరణకు మార్గం సుగమం కాగా, భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ అధికారాలపై మరోసారి చర్చ ప్రారంభమైంది.కాగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించిన ప్రకారం, జూన్ 21న జరిగిన నీట్ రీ–టెస్ట్‌కు ముందు విద్యార్థుల్లో అనవసర ఆందోళనలు, అపోహలు వ్యాపించే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చర్య తీసుకుంది. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు. దాంతో మే 21న దాని అసలు ఎక్స్ ఖాతాను భారతదేశంలో నిలిపివేశారు. అనంతరం ఈ బృందం Cockroach Is Back’ పేరుతో మరో కొత్త ఎక్స్ ఖాతాను ప్రారంభించింది. ప్రస్తుతం ఆ ఖాతాకు రెండు లక్షల 27 వేలకుపైగా ఫాలోవర్లు ఉన్నారు.

కాపు నేతల్లో పరుగు పందెం

కాకినాడ, జూలై 8, పెన్ పవర్:
వైసీపీ కాపు సామాజికవర్గం నేతల్లో పోటీ ఎక్కువ కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో గెలవడమే కాకుండా పార్టీ అధికారంలోకి వస్తే తమకు కేబినెట్ పదవి దక్కుతుందన్న భావన చాలా మందిలో వ్యక్తమవుతుంది. అందుకే వైసీపీ లో ఇప్పుడు కాపు సామాజికవర్గం నేతల వాయిస్ మాత్రమే గట్టిగా వినిపిస్తుంది. మిగిలిన సామాజికవర్గం నేతలు పెద్దగా కనిపించడం లేదు. గతంలో మంత్రులుగా పనిచేసిన రెడ్డి, ఎస్.సి, ఎస్టీ, కమ్మ సామాజికవర్గం నేతలు కూడా వైసీపీ తరుపున బయటకు వచ్చి మాట్లాడటం లేదు కానీ.. కాపు సామాజికవర్గం నేతలు మాత్రం హైలెట్ కావడానికి విపరీతంగా ప్రయత్నిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం వచ్చే ఎన్నికల్లో గెలిస్తే పదవి కోసమేనన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తుందివైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కాపు సామాజికవర్గం నేతలకు జగన్ తన కేబినెట్ లోఅవకాశం కల్పించారు. బొత్స సత్యనారాయణ, కన్నబాబు, అంబటి రాంబాబు, పేర్ని నాని, ఆళ్ల నాని వంటి వారు మంత్రి పదవిని జగన్ మంత్రివర్గంలోపొందారు. ఆళ్ల నాని పార్టీ నుంచి వెళ్లిపోయినా మిగిలిన నేతలుమాత్రం పార్టీలోనే ఉండిపోయారు. ఎవరూ ఇతర పార్టీల్లోచేరేందుకు కూడా ప్రయత్నించలేదు. సహజంగా జనసేన లోకి వెళ్లాల్సిన నేతలు కూడా వైసీపీలోనే ఉండిపోయారు. ఇక వెళ్లే అవకాశం కూడా లేకపోవచ్చు. అయితే ఇదే సమయంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీ కాపు నేతల్లోనే పదవి కోసం రేసు మొదలయినట్లు కనిపిస్తుంది. గత కొన్ని రోజులుగా చూసిన వారికి ఎవరికైనా ఇదే భావన అనిపించక మానదు. . వైసీపీ ఓటమి పాలయి పదకొండు సీట్లకే పరిమితమయిన తర్వాత కాపు నేతలే ఎక్కువ గళం విప్పుతున్నారు. ఇక ఇటీవల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా హైలెట్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. తోట త్రిమూర్తులు సీనియర్ నేత. అందుకే ఆయన ఇటీవల తన ఇలాకాలో వైసీపీ కాపు నేలత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జగన్ దృష్టిలో పడేందుకు ప్రయత్నించారు. అందులో తోట త్రిమూర్తులు సక్సెస్ అయ్యారనే చెప్పాలి. ముద్రగడ పద్మనాభం వంటి నేతలు అనారోగ్యంతో బాధపడుతుండటంతో తోట త్రిమూర్తులు కాపు సామాజికవర్గాన్ని వైసీపీకి దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద వైసీపీలో ఇతర సామాజికవర్గాల కంటే కాపు సామాజికవర్గం నేతల హడావిడే ఎక్కువగా కనిపిస్తుంది. మరి కాపు నేతల్లో ఎవరు రేసులో ముందుంటారన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

మండలిది అదే బాట...

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు రాజకీయ వైరాగ్యం వచ్చింది. ఆయన గత ఎన్నికల్లో తాను పోటీ చేసి తప్పు చేశానని బాధపడుతున్నారు. నిజానికి తాను గెలిచి తప్పు చేశానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనడం ఏపీ రాజకీయాలకు అద్దం పడుతుంది. నిజానికి మండలి బుద్ధ ప్రసాద్ సౌమ్యుడు. ఆయన ఎవరినీ నొప్పించరు. ఒకరిని మాట తూలే వ్యక్తి కాదు. నాయకుల్లో విభిన్నమైన నేతగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కు పేరుంది. ఆయన తండ్రి మండలి వెంకట కృష్ణారావు నుంచి నేర్చుకున్న రాజకీయ పాఠాలు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ను రాజకీయంగా ఇంత వరకూ తీసుకు వచ్చాయి.తెలుగు భాషను కాపాడుకోవడం కోసం దశాబ్ద కాలం నుంచి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే నియోజకవర్గంలోఆయనకు మంచి పేరుంది. అవినీతి, ఆరోపణలకు దూరంగా ఉంటారు. ఆయన రాజకీయ జీవితంలో ఇప్పటి వరకూ చిన్న మచ్చ లేదు. కాకుంటే ఒకటే. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనేక పార్టీలుమారారు. కాంగ్రెస్ లోఉన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తర్వాత టీడీపీలోచేరారు.

2014 లోటీడీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నాడు శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా పనిచేశారు. అయితే గత ఎన్నికలకు ముందు ఆయనకు టిక్కెట్ ఇబ్బందికరం కావడంతో జనసేనలోకి మారారు. ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అవనిగడ్డ నియోజకవర్గంలో సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఆయన ఎదుర్కొంటున్నారు బహుశ అదే ఆయనను బాధించి ఉండవచ్చంటున్నారు. తనకన్నా రాజకీయంగా తక్కువ అనుభవం ఉన్న నేతలతో పాటు వయసు కూడా తక్కువ ఉన్న వారు తనను విమర్శించడం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తట్టుకోలేకపోతున్నారు. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కూడా వ్యక్తిగత విమర్శలకు వేదికగా మారడం ఆయనను మరింత బాధించినట్లుంది. అందుకే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తాను రాజకీయాల్లో ఎందుకున్నానో అనిపిస్తోందని వ్యాఖ్యానించారు.ఈసారి ఎమ్మెల్యేగా గెలవడమే పెద్ద తప్పు చేశానని మండలి బుద్ధప్రసాద్ అన్నారంటే ఎంత వేదన చెందారో అర్థం చేసుకోవచ్చు. దిగజారిన రాజకీయ విలువలను చూసి రోజూ బాధపడుతున్నానని మండలి బుద్ధప్రసాద్ అన్నారంటే అందుకు గల కారణాలు నేటి తరం రాజకీయ నేతలు తెలుసుకోవాల్సి ఉంటుంది.

దళిత క్రైస్తవ సామాజికవర్గం చుట్టూ రాజకీయ చదరంగం

ఏలూరు, జూలై 8, పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఎన్నికల ముగింపు తర్వాత కూడా తెరవెనుక సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో సుమారు 15% నుండి 18% వరకు బలంగా ఉంటూ, దశాబ్ద కాలంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత నమ్మకమైన, సహజ సిద్ధమైన ఓటు బ్యాంక్‌గా ఉన్న దళిత క్రైస్తవ సామాజికవర్గం చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ చదరంగం నడుస్తోంది. మొన్నటివరకు జగన్ మోహన్ రెడ్డికి ఏకపక్షంగా అండగా నిలిచిన ఈ వర్గానికి తానే ఏకైక లీడర్నని, రక్షకుడినని చెప్పుకుంటూ జై భీమ్ భారత్ పార్టీ అధినేత, లాయర్ జడ శ్రవణ్ కుమార్ రంగంలోకి దిగారు. గత ఎన్నికల్లో మంగళగిరితో పాటు పలు స్థానాల్లో సొంతంగా అభ్యర్థులను నిలబెట్టి ఓట్లు చీల్చిన శ్రవణ్.. ఇప్పుడు ఏకంగా తానే దళిత క్రైస్తవుల ప్రత్యామ్నాయ డిప్యూటీ సీఎం అనే రేంజ్‌లో బిల్డప్ ఇస్తూ చేస్తున్న రాజకీయం ఢిల్లీ స్థాయి దాకా చర్చనీయాంశమైంది.రాజకీయ నిపుణుల లోతైన విశ్లేషణ ప్రకారం.. జడ శ్రవణ్ కుమార్‌కు అత్యంత స్పష్టమైన, సుదూర రాజకీయ లక్ష్యాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవుల నిరసన సభలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఆయన చేసిన తీవ్రమైన వ్యాఖ్యలు దీనికి స్పష్టమైన ఉదాహరణ. పవన్ కల్యాణ్ కాపు సామాజికవర్గానికి డిప్యూటీ సీఎం అయితే.. నేను దళిత క్రైస్తవ సామాజికవర్గానికి డిప్యూటీ సీఎంను అనే తరహాలో శ్రవణ్ క్లెయిమ్ చేసుకోవడం వెనుక.. జగన్ మోహన్ రెడ్డి ఇమేజ్‌ను పక్కనబెట్టి, సదరు ఓటు బ్యాంక్‌ను తన స్వంత అకౌంట్‌లోకి మార్చుకోవాలనే మైండ్ గేమ్ స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో జోసఫ్ రావణ్‌కు మద్దతుగా జడ శ్రవణ్ పని చేశారు. ఇక్కడే వైసీపీ ఊహించని పెద్ద పొలిటికల్ షాక్ తగలనుంది. జోసఫ్ రావణ్, జడ శ్రవణ్ కుమార్ వంటి వారు పవన్ కల్యాణ్‌ను, కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుంటే.. వైసీపీ అనుకూల మీడియా వీరికి విపరీతమైన కవరేజ్ ఇస్తూ ప్రమోట్ చేస్తోంది. కూటమిని ఇబ్బంది పెట్టడానికి వీరు పనికొస్తారని జగన్ మోహన్ రెడ్డి భావిస్తుండవచ్చు. కానీ, పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్న నిజం ఏంటంటే.. వీరిని ఎంతగా ప్రోత్సహిస్తే అంతగా వైకాపాకే భారీ నష్టం వాటిల్లుతుంది. ఎందుకంటే, దళిత క్రైస్తవ సమాజంలో ఒక కొత్త లీడర్‌గా జడ శ్రవణ్ కుమార్ ఎస్టాబ్లిష్ అయితే.. మొదట ఖాళీ అయ్యేది వైసీపీ ఓటు బ్యాంక్ అని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో దళిత, మైనారిటీ వర్గాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో తమకు జరిగిన అన్యాయాలు, నిధుల మళ్లింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని గత ఎన్నికలు నిరూపించాయి. జగన్ మోహన్ రెడ్డి కేవలం ఓట్ల కోసమే తమను వాడుకున్నారనే భావన క్రైస్తవ పెద్దలలో బలంగా నాటుకుంటోంది. అందుకే గత ఎన్నికల్లో కొంత మంది కాంగ్రెస్ కు ఓటు వేశారు. ఇలాంటి తరుణంలో జడ శ్రవణ్ కుమార్ రూపంలో ఒక దూకుడున్న దళిత న్యాయవాది, క్రైస్తవ హక్కుల రక్షకుడిగా ప్రచారం పొందితే.. ఆ వర్గాల యువత వైసీపీని వదిలేసి జై భీమ్ భారత్ పార్టీ వైపు మళ్లే అవకాశాలు 100 శాతం ఉన్నాయి. అంటే, కూటమిని దెబ్బతీయడానికి వాడుతున్న ఆయుధమే.. చివరికి వైసీపీ పునాదులనే తవ్వేసే ప్రమాదం ఉంది.వైసీపీ అనుసరిస్తున్న ఈ విధానం కచ్చితంగా భస్మాసుర హస్తం లాంటిదేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జోసఫ్ రావణ్ అరెస్ట్‌ను, ఉపా కేసులను బూచిగా చూపిస్తూ జడ శ్రవణ్ కుమార్ చేస్తున్న సెంటిమెంట్ పాలిటిక్స్ వల్ల.. వైసీపీ తన సొంత ఓటు బ్యాంక్‌పై నియంత్రణ కోల్పోతోంది. పవన్ కల్యాణ్ ఐడెంటిటీని ఎదుర్కొనే క్రమంలో, వైసీపీకి ప్రత్యామ్నాయంగా దళిత క్రైస్తవ సమాజానికి జడ శ్రవణ్‌ను లీడర్‌గా మార్చే ఈ వ్యూహం.. రాబోయే 2029 ఎన్నికల నాటికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆయా సామాజికవర్గాల్లో మూడో స్థానానికి పడిపోయేలా చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

పవన్ హోమ్ మంత్రి..?

విజయవాడ, జూలై 8, పెన్ పవర్:
ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో అనుచిత ప్రవర్తనను అదుపు చేయాలనే ఉద్దేశంతో ఉన్న ప్రభుత్వం ఉగ్రవాదులపై ప్రయోగించే ఉపా చట్టాన్ని వాడుకోవడం సంచలనంగా మారింది. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గతంలో ఎప్పుడూ ఇంత కఠిన నిర్ణయాలు తీసుకోలేదని, ఇప్పుడు సాధారణ కేసులలో కూడా విపరీతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని చర్చ జరుగుతోంది. చంద్రబాబు ఇలా మారడానికి కారణాలు ఏమైవుంటాయని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని, అందుకే సీఎం కూడా తన ప్రసంగాల్లో పవన్ పై జరుగుతున్న దాడిని ప్రస్తావిస్తూ తన ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలకు వివరిస్తున్నారని అంటున్నారు. దేశ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేత అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశ్చర్యకరంగా పవన్ ప్రభావంతో నిర్ణయాలు తీసుకోవడం ఏంటి? అన్నదే ప్రస్తుతం పొలిటికల్ సర్కిల్స్ లో విస్తృత చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద సార్లు ఆలోచించే చంద్రబాబు, తన 4.0 సర్కారులో మాత్రం కొన్ని అంశాల్లో జోరు చూపిస్తుండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. ఇందులో ప్రధానంగా సోషల్ మీడియా కేసుల విషయంలో చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రత్యర్థులను కూడా విస్మయానికి గురిచేస్తున్నాయని చెబుతున్నారు.రాష్ట్రానికి నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న చంద్రబాబుకు తొలి రెండు విడతలు సాఫీగా సాగిపోయాయి. అప్పట్లో సోషల్ మీడియా ప్రభావం లేకపోవడంతో చంద్రబాబు రాజకీయాలు ఒక మోస్తరుగా సాగిపోయేవి అని చెబుతున్నారు. అయితే 2014లో మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక సోషల్ మీడియా నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న చంద్రబాబు అధికారంలో

ఉన్నంత వరకు అవేవీ తనను ఇబ్బంది పెట్టే సమస్యగా భావించలేదని అంటున్నారు. దీంతో అప్పట్లో అంటే 2014–19 మధ్య చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలో పనిచేసిన వారిపై సోషల్ మీడియాలో ఎంతలా దాడి చేసినా పెద్దగా పట్టించుకోలేదని, పోలీసు కేసులు కూడా పెద్దగా పెట్టలేదని అంటున్నారు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఈ పరిస్థితిలో పూర్తి మార్పు కనిపిస్తోందని చెబుతున్నారు 2024 జూన్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నాళ్లు సోషల్ మీడియా పోస్టులపై ఉదాసీనంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ స్ట్రాంగ్ రియాక్షన్ తో కేసుల నమోదుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. తనతోపాటు కుటుంబ సభ్యులపైన అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు కనీస చర్యలు తీసుకోలేదని పవన్ అసంతృప్తి వ్యక్తం చేసిన తర్వాత వరుసపెట్టి కేసులు నమోదు చేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురిని అరెస్టు చేయడం గమనిస్తే ప్రభుత్వంపై పవన్ ఒత్తిడి ఎక్కువగానే ఉందన్న విషయం అర్థమవుతోందని అంటున్నారు. ప్రస్తుతం యూట్యూబర్ రావణ్ అరెస్టు ముందు కూడా 'తాను హోంమంత్రి అయితే' అంటూ పవన్ సోషల్ మీడియా కార్యకర్తలను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆ తర్వాత రావణ్ అరెస్టు జరగడం, వరుసగా బెయిలు వస్తున్న దశలో ఉపా చట్టం ప్రయోగించడం చూస్తే ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందనే విషయం అర్థమవుతోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తన మిత్రుడిని కాపాడుకోవడం కోసం సీఎం చంద్రబాబు ఇంతటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడమే అంతుచిక్కడం లేదని అంటున్నారు.

నాన్చుడు ధోరణితో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తారని, ప్రతివిషయాన్ని భూతద్దంలో చూస్తారని టీడీపీ కార్యకర్తలు సైతం విమర్శిస్తుంటారని చెబుతారు. కానీ, పవన్ విషయంలో చంద్రబాబు నాన్చుడు ధోరణికి స్వస్తి చెప్పడమే కాకుండా, ఆఘమేఘాలపై

నిర్ణయాలు తీసుకోవడం, యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం చూస్తే ఉప ముఖ్యమంత్రికి ప్రభుత్వంలో ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థమవుతోందని అంటున్నారు. అయితే ఇలాంటి కఠిన నిర్ణయాలు ప్రభుత్వానికి మంచి చేస్తాయా? లేదా? అన్న విషయమై సీఎం ఆలోచన చేస్తున్నారో? లేదో? కూడా తెలియడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

గోదావరి జిల్లాలకు జగన్

రాజమండ్రి, జూలై 8, పెన్ పవర్: వైసీపీ అధినేత వైఎస్ జగన్ చాలా కాలానికి ఆ ప్రాంతానికి వెళ్తున్నారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చేసే సత్తా కలిగిన ప్రాంతం అది. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమికి మొత్తానికి మొత్తం సీట్లు పట్టం కట్టి వైసీపీకి జీరో మార్కులు వేసిన కీలక రాజకీయ స్థావరమది. రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు అయిన గోదావరి జిల్లాలలో తమ పర్యటనకు జగన్ శ్రీకారం చుడుతున్నారు. జగన్ ఇప్పటిదాకా రెండేళ్ళ కాలంలో అడపా దడపా పరామర్శలు చేశారు. ఎక్కువగా క్రిష్ణా గుంటూరులలోనే ఆయన పర్యటనలు సాగాయి. మధ్యలో విశాఖ దాకా వచ్చారు. అయితే జగన్ తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి వస్తున్నారు వారితో కలసి ఆందోళన : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జగన్ పర్యటన ఈ నెల 15న ఉండబోతోంది. ఆక్వా రైతులను పరామర్శించి వారి సాధక బాధలను వినేందుకు జగన్ వస్తున్నారు అని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మధ్యనే ఆక్వా రైతులు తమ సమస్యలను జగన్ కి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కలసి తెలియచేశాయి. ఆ సమయంలో వారికి అండగా ఉంటూ వైసీపీ పోరాటం చేస్తుందని జగన్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే జగన్ పర్యటన భీమవరంలో పెట్టుకున్నారు అని అంటున్నార్. ఆక్వా రైతులను టీడీపీ కూటమి ప్రభుతం రెండేళ్ళ కాలంలో ఆదుకోలేదని వైసీపీ విమర్శిస్తోంది. సిండికేట్ యాజమాన్యాలు దళారులు కుమ్మక్కు అయి ఫీడ్ రేట్లు భారీగా పెంచేసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్వా రైతులు ఆందోళనలో ఉన్నారని వైసీపీ నేతలు అంటున్నారుఇదిలా ఉంటే ఫీడ్ రేట్లు కొంత తగ్గించినా ఇంకా ఆక్వా రైతులు ఇబ్బందులలోనే ఉన్నారు అని అంటున్నారు. దాంతో ఆక్వా రైతులను స్వయంగా కలసి వారి సాధక బాధకాలను జగన్ వింటారు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ సందర్భంగా ఆక్వా రైతులను ఆదుకునేందుకు వైసీపీ తరపున కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. వ్యూహం ఇదేనా : ఇదిలా ఉంటే గోదావరి జిల్లాలు వైసీపీని 2024 ఎన్నికల్లో పూర్తి స్థాయిలో దెబ్బేశాయి. దాంతో వైసీపీ అధికారంలోకి రావడం పక్కన పెడితే ప్రతిపక్షంలోకి కూడా వచ్చేందుకు అవసరమైన సీట్లు అందుకోలేకపోయింది. ఈ క్రమంలో రెండేళ్ళ పాలన తరువాత జగన్ గోదావరి బాట పట్టారు అని అంటున్నారు. పోయిన చోటనే వెతుక్కోవాలన్నది రాజకీయ జీవులు చెప్పే మాట. ఆ విషయంలో వైసీపీ అధినాయకత్వం కూడా సరైన దారి ఇదే అని గోదావరి జిల్లాలా బాట పడుతోంది అని అంటున్నారు. ఆక్వా రైతుల సమస్యలనే ఆయుధంగా చేసుకుని కూటమి ప్రభుత్వం మీద గట్టిగానే పోరాటం చేయాలన్నది వైసీపీ ఆలోచనగా చెబుతున్నారు. మరి రాక రాక చాలా కాలానికి భీమవరం వస్తున్న జగన్ కి ఏ విధమైన రిసీవింగ్ ఉంటుంది, వైసీపీకి గోదావరి పల్స్ ఏ విధంగా చిక్కుతాయన్నది వేచి చూడాల్సి ఉంది.

హైదరాబాద్ లో కార్మిక మంత్రి ప్రజా దర్బారు

విజయవాడ, జూలై 8, పెన్ పవర్: సాధారణంగా ఒక రాష్ట్రానికి చెందిన మంత్రులు తమ సొంత నియోజకవర్గాలు లేదా జిల్లా కేంద్రాల్లో ప్రజా దర్బార్‌లు నిర్వహించి సమస్యలను పరిష్కరించడం మనం చూస్తుంటాం. కానీ, ఏపీ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సరికొత్త సంప్రదాయానికి తెరలేపారు. పక్క రాష్ట్రమైన హైదరాబాద్‌లో ఏకంగా ప్రజా దర్బారుతోపాటు జాబ్ మేళా నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్‌లో బిక్షపతి యాదవ్ కళ్యాణ మండపంలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా మంత్రి సుభాష్ వినూత్నంగా ఈ కార్యక్రమం నిర్వహించారని అంటున్నారు. సాధారణంగా వృత్తి, వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షల మంది ఏపీ వాసులు తమ సొంత రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలు, పరిష్కారాల కోసం చాలా ఇబ్బందులు పడుతుంటారు. చిన్నచిన్న పనుల కోసం హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వెళ్లి ఆ పనులు చేయించుకునేందుకు వ్యయప్రసాలకు గురవుతుంటారు. ఇలాంటి వారి కోసం మంత్రి సుభాష్ చేసిన ప్రయోగం అభినందనలు అందుకుంటోంది. సహజంగా ఎన్నికల సమయంలో ఓటర్లు ఎక్కడ ఉంటే నేతలు అక్కడకు క్యూ కడుతుంటారు. అదేవిధంగా ప్రజలకు పాలన చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటిస్తుంటారు. కానీ, తమ ప్రాంత ప్రజల కోసం పక్క రాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా అభినందనీయమే అంటున్నారు. పక్క రాష్ట్రంలో ఒక మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించడం రాజకీయంగా ఒక వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. తమ ప్రాంతీయులు ఎక్కడ ఉన్నా వారికి అండగా ఉంటామనే సంకేతాన్ని పంపడం ద్వారా మంత్రి తన సొంత నియోజకవర్గంలో క్రేజ్ పెంచుకునే ఎత్తుగడ అమలు చేశారని అంటున్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే మంత్రి సుభాష్ ప్రజాదర్బార్, జాబ్ మేళా అంటూ హడావుడి చేస్తున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఏది ఏమైనా, హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ వేడిని పెంచడమే కాకుండా, ప్రజా రవాణా, సంక్షేమ పథకాలపై కూడా చర్చను రేకెత్తించింది, తన ప్రజాదర్బార్ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనను చూసి మంత్రి వాసంశెట్టి సుభాష్ సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోనే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నగరాల్లో నిర్వహించే అవకాశం ఉందని ఆయన సంకేతాలిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ తరహా వినూత్న ప్రయత్నాలు ప్రజాసేవలో సరికొత్త ఒరవడికి నాంది పలికే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

వివాదంలో పులవర్తి...

తిరుపతి, జూలై 8 పెన్ పవర్: తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేలు కట్టుబాటు తప్పుతున్నారు. ఆడియో లీకులు, వీడియోలు విడుదలవుతాయని తెలిసి కూడా కొందరు ఎమ్మెల్యేలు ఆవేశంతో చేస్తున్న పనులు పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారు. ఇటీవల చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఒక కాంగ్రెస్ నేతతో భూ వివాదంపై రిటైర్డ్ జడ్జిపై బూతు పురాణం సంచలనంగా మారింది. వంద కోట్ల విలువైన భూమి విషయంలో తలెత్తిన వివాదమే ఈ ఫోన్ కాల్ సారాంశం. అయితే గత వైసీపీ ప్రభుత్వంపై ఎలాంటి ఆరోపణలు టీడీపీ అధినేత చంద్రబాబు చేశారో అదే తప్పిదం ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ కనపడుతున్నాయి. దీంతో రెండు ప్రభుత్వాలకు పెద్దగా తేడా ఏముందన్న ప్రశ్నలు జనాల్లో మెదులుతున్నాయి.పులివర్తి నాని తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అదీ చంద్రబాబు తొలిసారి పోటీ చేసి రాజకీయాల్లోకి వచ్చిన చంద్రగిరి నియోజకవర్గంలో గెలిచి సత్తా చాటారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ టీడీపీకి గెలుపు దక్కలేదు. అలాంటి నియోజకవర్గంలో 2024లో పులివర్తి నాని ఆ బ్యాడ్ రికార్డును బద్దలు కొట్టి అందరి దృష్టిలో పడ్డారు. అక్కడ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గత కొన్ని ఎన్నికలుగా గెలుస్తూ వస్తున్నారు. చంద్రగిరి తన అడ్డాగా చెవిరెడ్డి భావించారు. అలాంటి చోట గెలిచిన పులివర్తి నాని చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. అయితే ఈ భూ వివాదంలో ఎందుకు ఇరుక్కున్నారన్నది ఇప్పటికీ టీడీపీ నాయకత్వానికి అర్థం కాని ప్రశ్నగానే ఉండిపోయింది. చంద్రబాబు, లోకేశ్ కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడినపులివర్తి నాని చంద్రగిరిలో తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేయాల్సి ఉంది.కానీ పులివర్తి నాని తొలిసారి గెలిచిన తర్వాత వివాదాల్లో చిక్కుకోవడం ఇప్పుడు పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. ఒక కుటుంబానికి చెందిన భూమిని రికార్డులు తారుమారు చేసి ఆక్రమించారంటూ ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ స్థలం తమదేనని పులివర్తి నాని వర్గీయులు వాదిస్తున్నారు. తిరుపతిలో కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవ సభవిజయవంతం కావడం చూసి ఓర్వలేక కొందరు ఇలా పులివర్తి నానిపై కుట్రలు పన్నుతున్నారని కూడా వారు ఆరోపిస్తున్నారు. కానీ అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. ఒక వృద్ధ దంపతులు మీడియా ముందుకు రావడం, రిటైర్డ్ ఆర్డీవో కూడా ప్రెస్ మీట్ పెట్టి మరీ విషయాలను వెల్లడించడంతో టీడీపీకి ఇబ్బందికరంగా మారింది. చంద్రబాబు సొంత జిల్లాలోనే భూ వివాదాలకు టీడీపీ నేతలు కేరాఫ్ గా మారుతుండటం కొంత పార్టీకి ఇబ్బందికరమైన పరిణామమేనని సీనియర్ నేతలు కూడా అంటున్నారు. మరి రానున్న కాలంలో ఎలాంటి పరిణామాలు జరుగుతాయన్నది చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు.. కారణమిదే!

భారత మార్కెట్లలో భారీగా పతనమైన బంగారం, వెండి ధరలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడమే ప్రధాన కారణం

హైదరాబాద్‌లో తులం బంగారంపై సుమారు రూ. 2,000 తగ్గుదల

కిలో వెండి ధర రూ. 6,000 వరకు క్షీణత

భారత మార్కెట్లలో బుధవారం బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సడలడం, తదనుగుణంగా అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న మార్పులే ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. హైదరాబాద్‌లో బుధవారం మధ్యాహ్న సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ. 2,000 తగ్గి రూ. 1,46,730 వద్ద నిలిచింది. వెండి ధరలో మరింత పతనం నమోదైంది. కిలో వెండి ధర దాదాపు రూ. 6,000 క్షీణించి రూ. 2.28 లక్షలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్సు బంగారం ధర 4,200 డాలర్ల సమీపం నుంచి తగ్గి 4,049 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఔన్సు వెండి 58.40 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. భారత ఫ్యూచర్స్ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కొనసాగింది. ఎంసీఎక్స్ మార్కెట్‌లో ఆగస్టు గోల్డ్ ఫ్యూచర్స్ 1.5 శాతం మేర నష్టపోగా, సెప్టెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ 3 శాతానికి పైగా క్షీణించాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ లేదా తాత్కాలిక శాంతి ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన అనంతరం ధరల్లో ఈ దిద్దుబాటు చోటుచేసుకుంది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో అనిశ్చితి తగ్గింది. దీంతో ఇన్వెస్టర్లు బంగారం, వెండి వంటి సురక్షిత పెట్టుబడుల నుంచి తమ దృష్టిని మళ్లించడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి.

‘ట్రైన్ టు బుసాన్’.. లోకేశ్ ఇంట్రెస్టింగ్ ట్వీట్

టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. ఇంకా చెప్పాలంటే టెక్నాలజీ వాటడంలో ఆయన ఇతర నేతలు కంటే ముందుంటారు. అదేవిధంగా ఎంటర్‌టైన్మెంట్, స్పోర్ట్స్ ల్లో పరకాయ ప్రవేశం చేస్తూ తనను తాను ప్రత్యేకంగా ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తుంటారు. తన అధికారిక పర్యటనలు, పర్సనల్ విశేషాలు, రాష్ట్రాభివృద్ధికి చెందిన ముఖ్య సమాచారం ఎక్కువగా సోషల్ మీడియా ద్వారానే వెల్లడిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం మంత్రి లోకేశ్ చేసిన ఒక ట్వీట్ వైరల్ అవుతోంది. బిజినెస్ మేన్ లా స్టైలిష్ లుక్ లో ఉన్న ఫొటోలతోపాటు దక్షిణ కొరియాలో సహచరులతో కలిసి ట్రైనులో జర్నీ చేస్తున్న ఫొటోలను మంత్రి తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఈ పోస్టులో ఈ రోజు దక్షిణకొరియాలో భిన్నమైన ప్రయాణం చేస్తున్నాను అంటూ తెలియజేస్తూ “ట్రైన్ టు బుసాన్” అనే ప్రఖ్యాత చిత్రాన్ని గుర్తు చేశారు.

కొరియన్ చిత్రమైన ‘ట్రైన్ టు బుసాన్’ అత్యంత ప్రసిద్ధమైన యాక్షన్-హారర్ సినిమా. ఈ పేరు తెలియని వారు ఉండరని అంటారు. దీంతో తన పర్యటన విశేషాలను తెలియజేసేందుకు లోకేశ్ తెలివిగా ఆ చిత్రం పేరును వాడుకుని అందరిలో ఒక రకమైన కుతూహలం పెంచేశారు. రాష్ట్రాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే బలమైన సంకల్పంతో మంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్కడ పారిశ్రామిక వర్గాలతో చేపడుతున్న చర్చల వివరాలను వెల్లడించేందుకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొరియన్ చిత్రం ‘ట్రైన్ టు బుసాన్’ పేరును గుర్తు చేస్తూ సియోల్ నుండి బుసాన్ నగరానికి రైలులో ప్రయాణిస్తున్న ఫొటోలను షేర్ చేశారు. బ్లాక్ సూట్, అత్యంత ప్రొఫెషనల్ లుక్ ఉన్న ఫొటోలను జతచేయడంతో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

అపెక్స్-కొరియా ప్రారంభం

మంత్రి లోకేష్ తన పర్యటనను కేవలం పలకరింపులకే పరిమితం చేయకుండా, పెట్టుబడుల ఆకర్షణకు బలమైన పునాదులు వేస్తున్నారు. బుసాన్‌లో ఆయన ‘అపెక్స్-కొరియా’ కేంద్రానికి శ్రీకారం చుట్టినట్లు ఎక్స్ లో ప్రకటించారు. ఇది ఆంధ్రప్రదేశ్, దక్షిణ కొరియా మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేయడమే కాకుండా, కొరియన్ పెట్టుబడిదారులకు ఏపీలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడానికి ఒక సింగిల్ విండో వ్యవస్థగా పనిచేస్తుందని తెలిపారు. ఈ ప్రయత్నం ఏపీని కొరియన్ పారిశ్రామిక దిగ్గజాలకు ప్రధాన గమ్యస్థానంగా మార్చే దిశగా వేసిన కీలక అడుగు అని పరిశ్రమల నిపుణులు భావిస్తున్నారు.

దిగ్గజ సంస్థలతో వరుస సమావేశాలు

తన పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ వరుసగా అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల అధిపతులతో సమావేశమవుతున్నారు. ముఖ్యంగా 101.9 బిలియన్ డాలర్ల భారీ ఆస్తులు కలిగిన బీఎన్-కే ఫైనాన్షియల్ గ్రూప్‌తో ఆయన జరిపిన చర్చలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమరావతి రాజధానిలో తమ కార్యకలాపాలను ప్రారంభించాల్సిందిగా మంత్రి ఆ సంస్థను కోరారు. ఇది మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అమరావతి అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని చెబుతున్నారు. అలాగే, బూయాంగ్ గ్రూప్, హ్యుంగ్ సాంగ్ గ్రూప్ వంటి సంస్థల ప్రతినిధులతో కూడా ఆయన భేటీ కానున్నారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన పర్యటన

ఈ పర్యటన కేవలం సమావేశాలకే పరిమితం కాలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి క్షేత్రస్థాయిలో పారిశ్రామిక అనుభవాలను తెలుసుకోవడానికి కూడా లోకేష్ ప్రాధాన్యతనిస్తున్నారు. కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, ఏపీలోని సముద్ర ఆధారిత పరిశ్రమల విస్తరణపై చర్చించనున్నారు. అలాగే, స్థానిక షూ ఫ్యాక్టరీని సందర్శించి, కొరియన్ తయారీ రంగంలోని పద్ధతులు, టెక్నాలజీ గురించి తెలుసుకోనున్నారు. ఐటీ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రపంచస్థాయి సంస్థలను ఏపీకి తీసుకురావడమే ధ్యేయంగా మంత్రి లోకేష్ చేస్తున్న ఈ పర్యటన రాష్ట్రానికి ఏ మేరకు ఫలితాలను అందిస్తుందో వేచి చూడాలి.

లాస్ ఏంజిల్స్ ప్రవాస భారతీయుడికి ఇండియన్ పోలీస్ ఆఫీసర్ బెదిరింపులు.. రూ.3.4 కోట్లు డిమాండ్

అమెరికాలో నివసిస్తున్న ఒక భారతీయ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని.. భారతదేశానికి చెందిన ఒక ఉన్నత పోలీసు అధికారి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేసిన ఉదంతం అంతర్జాతీయంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. లాస్ ఏంజిల్స్‌లో స్థిరపడిన సదరు కుటుంబం నుంచి ఏకంగా 4 లక్షల అమెరికన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 3.4 కోట్లు) వసూలు చేసేందుకు సదరు అధికారి బెదిరింపులకు పాల్పడినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. విదేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయుల రక్షణ, అంతర్జాతీయ నేరాల దర్యాప్తు కోణంలో ఈ ఘటన ఇప్పుడు ఇరు దేశాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.

తప్పుడు కేసుల పేరిట బ్లాక్‌మెయిల్

అమెరికా చట్ట అమలు సంస్థలు సేకరించిన ప్రాథమిక వివరాల ప్రకారం.. బాధితులు డిమాండ్ చేసిన భారీ మొత్తాన్ని చెల్లించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆ అధికారి హెచ్చరించినట్లు తెలుస్తోంది. సదరు కుటుంబ సభ్యులపై భారతదేశంలో తప్పుడు హత్య కేసులు నమోదు చేస్తానని సదరు అధికారి బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భారతదేశంలో ఉన్న వారి ఆస్తులను జప్తు చేయిస్తామని.. తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో ఇరికిస్తామని భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం. ఈ ఆకస్మిక బెదిరింపులతో తీవ్ర ఆందోళనకు గురైన సదరు కుటుంబం, వేధింపులు తట్టుకోలేక చివరకు అమెరికా రక్షణ, దర్యాప్తు సంస్థలను ఆశ్రయించింది. దీంతో ఈ అంతర్జాతీయ దోపిడీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

అమెరికాకు అప్పగించేందుకు చర్యలు తీవ్రం

ఈ కేసును అమెరికా అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకంగా.. తీవ్రంగా పరిగణిస్తున్నారు. సాంకేతిక ఆధారాలు, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ , బాధితుల స్టేట్‌మెంట్ల ఆధారంగా సదరు పోలీసు అధికారిపై పక్కా ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. విదేశీ గడ్డపై ఉన్న పౌరులను డిజిటల్ మాధ్యమాల ద్వారా బెదిరించి డబ్బు వసూలు చేయడం అంతర్జాతీయ సైబర్ , వ్యవస్థీకృత నేరం కిందకు వస్తుందని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో సదరు భారత పోలీసు అధికారిని విచారణ నిమిత్తం అమెరికాకు రప్పించేందుకు అక్కడి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అధికారికంగా నేరగాళ్ల అప్పగింత ప్రక్రియను ప్రారంభించేందుకు అమెరికా న్యాయ శాఖ సన్నహాలు చేస్తోంది. ఇందుకోసం అవసరమైన దౌత్యపరమైన దస్త్రాలను సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఇరు దేశాల దౌత్య సంబంధాలపై ప్రభావం?

ఈ తీవ్రమైన ఆరోపణలపై భారత ప్రభుత్వం గానీ, లేదా సదరు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారి తరఫు న్యాయవాదులు గానీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. భారత్, అమెరికా దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక నేర పరిశోధన ఒప్పందాలు, నేరగాళ్ల అప్పగింత నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు ఉండనున్నాయి. ఒకవేళ అమెరికా అధికారికంగా అప్పగింత కోరితే, భారత ప్రభుత్వం అంతర్గతంగా విచారణ జరిపి తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ చట్టాన్ని రక్షించాల్సిన ఒక పోలీసు అధికారి ఇలా అంతర్జాతీయంగా బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడటం తీవ్ర చర్చనీయాంశమైంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరిన్ని షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

‘మావిగన్’ అందరికీ ఆమోదయోగ్యం.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కీలక వ్యాఖ్యలు

రాజధాని అమరావతికి బదులుగా మాజీ సీఎం జగన్మోహనరెడ్డి ప్రతిపాదించిన ‘మావిగన్’ వల్లే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన పెద్దిరెడ్డి రాజధాని అమరావతితోపాటు మావిగన్ పైన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మావిగన్ వల్ల వెనుకబడిన ప్రాంతం అంతా అభివృద్ధి చెందుతుందని పెద్దిరెడ్డి అన్నారు. అందుకే మావిగన్ ప్రతిపాదనకు తమ పార్టీ సంపూర్ణంగా ఆమోదిస్తుందని చెప్పారు. ప్రజలు కూడా మావిగన్ కు అనుకూలంగా ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ఇదే సమయంలో రాజధాని అమరావతిపైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డబ్బులు అన్నీ తెచ్చి నీళ్లలో పడేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజధానిగా అమరావతిని కేంద్రం గుర్తిస్తూ చట్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నేతలు ‘మావిగన్’పై ప్రకటనలు చేస్తుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. రాజధాని చట్టం చేసిన రోజే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మావిగన్ ప్రతిపాదన తెరపైకి తీసుకురాగా, వైసీపీ నేతలు అంతర్గతంగా భిన్నమైన వాదనలు వినిపిస్తున్నారని చర్చ జరుగుతున్న సమయంలో సీనియర్ నేత పెద్దిరెడ్డి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారని అంటున్నారు.

మావిగన్ పై భిన్నాభిప్రాయాలు ఏవీ లేవని, పార్టీ నేతలు అంతా మావిగన్ ను ఆమోదిస్తున్నారని పెద్దిరెడ్డి వెల్లడించారు. దీంతో మావిగన్ విషయంలో వైసీపీ స్ట్రాంగ్ డెసిషన్ తీసుకుందని స్పష్టమవుతోందని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం మావిగన్ వర్సెస్ అమరావతి అన్న అజెండాతోనే ఎన్నికలకు వెళతామని మాజీ సీఎం జగన్ చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రకటనను బలపరుస్తూ సీనియర్ నేత పెద్దిరెడ్డి సైతం మావిగన్ పై మాట్లాడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని అంటున్నారు.

వైసీపీలో సీనియర్లు సైతం రాజధాని అమరావతిని వ్యతిరేకిస్తున్నట్లు ఈ ప్రకటనతో స్పష్టమైందని అంటున్నారు. రాజధాని అమరావతిలో వేల కోట్ల రూపాయల పనులు జరుగుతుండగా, ఆ డబ్బు అంతా నీళ్లలో పోసేస్తున్నారని వైసీపీ విమర్శలు గుప్పిస్తోంది. అమరావతికి బదులుగా మూడు నగరాలతో కూడిన రాజధానికి తాము కట్టుబడినట్లు వైసీపీ చెబుతుండటంతో మరోసారి రాజధానిపై హాట్ టాపిక్ జరుగుతోంది. విపక్షం మావిగన్ అంటూ గట్టిగా మాట్లాడతుండటం వ్యూహాత్మర రాజకీయ ఎత్తుగడగా పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. వేల కోట్లు అప్పు తెచ్చి ప్రభుత్వం నిర్మాణాలు జరుగుతుండగా, ప్రైవేటు పెట్టుబడిదారులను గందరగోళానికి గురిచేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వైసీపీ మావిగన్ పై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందని అంటున్నారు.

మళ్లీ అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు : పెరిగిన చమురు ధరలు.. భారత్‌కు కొత్త ఆందోళన

మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య తలెత్తిన తాజా ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్లను ఒక్కసారిగా కుదిపేశాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ప్రసక్తే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా రెక్కలు తొడిగాయి. ఈ పరిణామం ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడే భారత్ లాంటి దేశాలకు కొత్త తలనొప్పులను తెచ్చిపెడుతోంది.

భగ్గుమంటున్న చమురు ధరలు.. పతనమైన రూపాయి

అంతర్జాతీయ మార్కెట్‌లో తాజా ట్రేడింగ్‌లో క్రూడాయిల్ ధరలు ఏకంగా 5 శాతానికి పైగా ఎగబాకాయి. ప్రస్తుతం వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ బ్యారెల్ ధర సుమారు 74 డాలర్లకు చేరగా, బ్రెంట్ క్రూడ్ ధర 78.57 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ చమురు సంక్షోభం భారత కరెన్సీపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారు 0.40 శాతం నష్టపోయి, సరికొత్త జీవితకాల కనిష్ట స్థాయి 95.67 వద్దకు పడిపోవడం దేశీయ మార్కెట్లను కలవరపెడుతోంది.

అమెరికా మెరుపు దాడులు.. హోర్ముజ్ జలసంధిలో హై అలర్ట్

అమెరికా వర్గాల సమాచారం ప్రకారం.. జూలై 7న అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్‌లోని పలు వ్యూహాత్మక లక్ష్యాలపై భారీ ఎత్తున దాడులు నిర్వహించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన ‘హోర్ముజ్ జలసంధి’ మీదుగా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే తాము ఈ చర్యలు చేపట్టినట్లు అమెరికా ప్రకటించింది. ఈ వైమానిక దాడుల్లో ఇరాన్‌కు చెందిన వైమానిక రక్షణ వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు.. తీర ప్రాంత రాడార్ వ్యవస్థలు, యాంటీ-షిప్ క్షిపణి కేంద్రాలు.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు చెందిన చిన్న తరహా పడవలను అమెరికా సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. గత నెలలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కాస్త తగ్గినట్లు కనిపించినా తాజా దాడులతో ఆ శాంతి తాత్కాలికమేనని తేలిపోయింది. ప్రపంచ చమురు రవాణాలో సింహభాగం సాగే హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు మరింత ముదిరితే, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌కు పొంచి ఉన్న ముప్పులేమిటి?

తన ముడి చమురు అవసరాల్లో దాదాపు 80-85 శాతం వరకు దిగుమతుల ద్వారానే భారత్ తీర్చుకుంటుంది. ఈ నేపథ్యంలో తాజా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై బహుముఖ ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి పెరుగుతుంది. ఇంధన ధరలు పెరిగితే రవాణా వ్యయం భారమై, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ఒకవైపు చమురు ధరలు పెరగడం, మరోవైపు రూపాయి బలహీనపడటంతో విదేశాల నుంచి చేసుకునే దిగుమతులు భారత్‌కు అత్యంత ఖరీదైనవిగా మారనున్నాయి.

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఈ భౌగోళిక రాజకీయ పరిస్థితులు రానున్న రోజుల్లో ఏ మలుపు తిరుగుతాయోనని ప్రపంచ దేశాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి. అమెరికా-ఇరాన్ సంక్షోభం గనుక మరింత ముదిరితే అది భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రగతికి పెద్ద బ్రేక్ వేసే ప్రమాదం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కమ్ముతోన్న కరవు!

ప్రకృతి పగ్గాలు చేజారిపోతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తీవ్రస్థాయి ఎల్‌నినో ముప్పు అంచనాలు నిజమవుతూ, 2026 నైరుతి రుతుపవన సీజన్ దీర్ఘకాలిక సగటులో 90శాతానికి పరిమితం కావచ్చని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. లోటు వర్షపాతం సంభావ్యత సాధారణ 16శాతంతో పోలిస్తే రెండింతలకు పైగా, అంటే 35శాతానికి చేరుకుంది. జూన్ నెలాఖరుకు దేశవ్యాప్తంగా వర్షపాత లోటు 40శాతానికి పైగా నమోదైంది. పసిఫిక్ మహాసముద్రంలో నినో-3.4 సూచీ ఎల్‌నినో పరిమితిని దాటిందని, గత ఏడాది కాలంలో తటస్థ- లానినో తిరిగి తటస్థ పరిస్థితుల మధ్య ఊగిసలాడిన సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పుడు స్థిరంగా పెరుగుతున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు నిర్ధరించారు. దీనికితోడు, హిందూ మహాసముద్రంలో సానుకూల ద్విధ్రువ పరిస్థితులు ఏర్పడితే ఎల్‌నినో దుష్ప్రభావాన్ని కొంతమేర తగ్గించే వీలుండేది. కానీ ఈసారి తటస్థ ద్విధ్రువ పరిస్థితులే కొనసాగుతాయని అంచనా వేయడంతో, ఆ ఊరటకూడా లేకుండా పోయింది. సోమాలి జెట్‌వంటి రుతుపవన వాహక గాలుల బలం, పశ్చిమ వాతావరణ కల్లోలాల పునరాగమనంవంటి అంశాలు రాబోయే వారాల్లో పరిస్థితిని మెరుగుపరచవచ్చున్న ఆశ ఉన్నా, జూన్‌లో నమోదైన భారీ లోటు వర్షపాతాన్ని పూడ్చుకోవడం అంత సులభం కాదు. ఫలితంగా మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు తీవ్ర ప్రభావిత జాబితాలో చేరాయి. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గుర్తించిన 315 సున్నిత జిల్లాల్లో.. సాగునీటి సదుపాయం అంతంతమాత్రంగా ఉన్న 111 అత్యధిక ప్రాధాన్యత జిల్లాలు ఖరీఫ్ సాగుకు అతిపెద్ద సవాలుగా నిలిచాయి. అమెరికా వాతావరణ సంస్థ నోవా అంచనాల ప్రకారం, ఈ ఎల్‌నినో బలపడుతూ 2026-27 శీతాకాలం వరకు కొనసాగే అవకాశం 96 శాతం ఉంది. సాగు, జీవనోపాధి, ఆహార భద్రతపై దీర్ఘకాలిక ప్రభావం చూపే పరిణామమిది!

దేశ సేద్యరంగంలో దాదాపు 60శాతం వర్షాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరు పండించే పప్పుధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు దేశ పౌష్టికాహార భద్రతకు వెన్నెముక. వర్షపాతం సగటుకంటే తగ్గితే అది కేవలం దిగుబడులను దెబ్బతీయడమే కాకుండా, లక్షలాది రైతు కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తుంది. 2024-25లో దేశం రికార్డుస్థాయిలో 353.96 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేసినప్పటికీ, అంతకుముందు 2021-22 నుంచి ఉత్పత్తిలో హెచ్చుతగ్గుల కారణంగా గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెరపై తాత్కాలిక ఎగుమతి నిషేధాలు విధించాల్సి వచ్చిన అనుభవమింకా మరవలేనిది. ఈ సున్నితమైన సమతూకానికి ఇరాన్ యుద్ధం మరో పెద్ద సవాలుగా మారింది. ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల అంతర్జాతీయ సరఫరా గొలుసులపై దాని ప్రభావం ప్రత్యక్షంగా రైతుల ఉత్పాదక వ్యయాలను పెంచుతోంది. దిగుమతి ఆధారిత ఎరువుల ధరలు పెరిగినకొద్దీ, ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం తగినంత నిల్వ చేసినా, రబీ సీజన్ నాటికి కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే అస్థిర వర్షాలు, ఆలస్యమైన రుతుపవనాలు, ఆకస్మిక వడగాడ్పుల కారణంగా నష్టపోతున్న వర్షాధార రైతులు- ఎరువుల కొరత, పెరిగిన ధరల భారంతో మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముంది. గత ఐదేళ్లలో అత్యధిక వర్షపాతం నమోదైన నెలలు, అత్యంత పొడి వాతావరణం నెలకొన్న నెలలు ఒకదానివెంట ఒకటి రావడం.. సంప్రదాయ రుతు చక్రాలు పూర్తిగా అస్తవ్యస్తమయ్యాయనడానికి నిదర్శనం! ఈ పరిస్థితుల్లో సంప్రదాయ సాగు పద్ధతులను గుడ్డిగా అనుసరించడం క్షేమకరం కాదు. వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలను ప్రతి జిల్లాకూ చేరవేయడం, వర్షాధార ప్రాంతాల్లో బహుళ పంటల విధానాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ ఎరువులు- జీవబొగ్గు (బయోచార్) వంటి పద్ధతుల ద్వారా నేల నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచడంవంటి చర్యలు తక్షణావసరం. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వడం ద్వారానే స్థిరమైన దిగుబడులు సాధ్యం. వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఏ పంట ఎప్పుడు వేయాలో, ఏ మేర నీటి యాజమాన్యం చేపట్టాలో రైతులకు స్పష్టంగా తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

ఈ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే నిల్వ మౌలిక సదుపాయాల బలోపేతం అత్యవసరం. దేశంలో వార్షికంగా 330 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతుండగా, శాస్త్రీయ నిల్వ సదుపాయం కేవలం 47శాతం ఉత్పత్తినే కప్పి ఉంచగలుగుతోంది. మిగిలిన 60-70శాతం ధాన్యం సంప్రదాయ గృహ నిల్వ పద్ధతుల్లోనే ఉండటంవల్ల కోతల అనంతర నష్టాలు గణనీయంగా ఉంటున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో నిల్వ సదుపాయం 90శాతానికి పైగా ఉంటే, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌వంటి రాష్ట్రాల్లో అది 50శాతం కన్నా తక్కువ. గ్రామస్థాయి నిల్వ సదుపాయం లేకపోవడం వల్ల రైతులు పంట కోతల వెంటనే మద్దతు ధర కన్నా తక్కువకే అమ్ముకోవాల్సిన దుస్థితి. ఎఫ్‌సీఐ, రాష్ట్ర సంస్థల వద్ద ప్రస్తుతం 917.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యమున్నా, అందులో అధిక భాగం మిగులు రాష్ట్రాల్లోని పెద్ద గోదాములకే పరిమితమై, గ్రామీణ ఉత్పత్తిదారులకు దూరంగా ఉండటం ఒక పెద్ద లోపం. దాదాపు 63వేల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) స్థాయిలో గోదాములు నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన "ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్య నిల్వ పథకం" హర్షణీయమే అయినా, దాన్ని మరింత వేగంగా, ముఖ్యంగా లోటు వర్షపాత ముప్పు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ప్రాధాన్యతా ప్రాతిపదికన అమలు చేయాల్సిన అవసరముంది. శీతల గిడ్డంగుల కొరత తీవ్రంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు ఏడువేల శీతల గిడ్డంగుల్లో 60 శాతానికి పైగా కేవలం ఒకటి రెండు రాష్ట్రాలకే పరిమితమవడం పంపిణీలో అసమతుల్యతను చూపిస్తోంది. అందుకే -పంటల బీమా పరిధిని వర్షాధార భూములన్నింటికీ విస్తరించడం, మద్దతు ధరలకు కొనుగోళ్లను పెంచడం, గోదాము రసీదుల ఆధారంగా రైతులకు రుణ సదుపాయం కల్పించడం, వాతావరణ సూచనలను స్థానిక భాషల్లో సకాలంలో అందించడం వంటి చర్యలు సమాంతరంగా జరగాలి. వాతావరణ మార్పు ఇకపై నిత్య వాస్తవం. దాన్ని ఎదుర్కొనేలా విధానాలను, మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవడంలో ఆలస్యం చేస్తే, రేపటి ఆహార భద్రతకు నేడే మూల్యం చెల్లించక తప్పదు!!

పనికొచ్చే పలుకు

నిశ్శబ్దంగా ఎదుగుతున్నట్టే..!

లక్ష్యాలను సాధించలేదనే బాధ, పక్కవారితో పోల్చుకుంటూ వెనుకపడిపోయామనే ఆందోళన చాలామందిని వేధిస్తోంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో ఉండే ఉరుకుల పరుగుల జీవితంలో, తోటివారితో పోలికలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. కానీ, నిజమైన ప్రగతి ఎల్లప్పుడూ అందరికీ కనిపించేలా పెద్ద మైలురాళ్లు లేదా భారీ విజయాల రూపంలోనే ఉండాలని లేదు! మనకు తెలియకుండానే, నిశ్శబ్దంగా సాగిపోయే రోజువారీ క్షణాల్లోనే జీవితం ఎంత నిలకడగా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. మీరు సరైన దిశలోనే ప్రయాణిస్తున్నారా లేదా అనే సందేహం మీలో ఉంటే, మీరు అనుకున్నదానికంటే చాలా మెరుగైన స్థితిలోనే ఉన్నారని చెప్పడానికి కొన్ని కీలకమైన సంకేతాలిక్కడ చూడండి.

బాధ్యతలు, సందేహాలే మీ బలం..: మీ ఈమెయిల్ ఇన్‌బాక్స్ నిండిపోవడం, క్యాలెండర్‌లో పనుల జాబితా ఉండటం, కట్టాల్సిన బిల్లులు సిద్ధంగా ఉండటం ఒక్కోసారి భారంగా అనిపించవచ్చు. అయితే, సమాజం మిమ్మల్ని నమ్ముతోందని, మీపై ఆధారపడుతోందని చెప్పడానికి ఇదే సంకేతం. బాధ్యతలు ఉండటం అంటే మీరు ఇతరుల జీవితాల్లో ప్రాధాన్యత కలిగిన వ్యక్తిగా మారారని అర్థం.

అలాగే, "నేను చేస్తున్న పని సరైనదేనా? ఇంకా బాగా చేయగలనా?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవడం మంచి పరిణామం. ఆత్మపరిశీలన అనేది ఒక వ్యక్తి నిరంతరం ఎదగాలని కోరుకుంటున్నాడనడానికి రుజువు. నేర్చుకోవడం ఆపేసిన వారు ఎప్పుడూ తమను తాము ప్రశ్నించుకోరనే నిజాన్ని గ్రహించాలి.

మానసిక స్పష్టత, నచ్చిన పనుల కోసం సమయం..: మీ జీవితంలో ఎక్కడో ఏదో లోపముందని లేదా ఒక విషయం సరిగ్గా సాగడం లేదని మనసుకు అనిపిస్తే, అది మీలో ఉన్న అవగాహనకు నిదర్శనం. ఏది తప్పుగా ఉందో గుర్తించడమే, జీవితాన్ని సానుకూల మార్గంలోకి మళ్లించడానికి పడే మొదటి అడుగు.

ప్రస్తుత బిజీ లైఫ్‌లో మీకు నచ్చిన పుస్తకం చదవడానికో, చిన్న అలవాట్లను కొనసాగించడానికో లేదా వారాంతాల్లో కాస్త ప్రశాంతంగా గడపడానికో సమయం కేటాయిస్తున్నారంటే, మీరు కేవలం బతకడం లేదు.. జీవితాన్ని ఆస్వాదిస్తూ జీవిస్తున్నారని అర్థం.

గతాన్ని చూసి గర్వపడటం.. భవిష్యత్తుపై ఆశ: ఒకప్పుడు "ఈ కష్టంనుంచి ఎలా గట్టెక్కుతాం?" అని భయపడిన రోజులను ఇప్పుడు గుర్తుచేసుకుని ప్రశాంతంగా నవ్వగలుగుతున్నారంటే మీలో అద్భుతమైన మానసిక స్థైర్యం ఉందని అర్థం. మీ గతంలోని చిన్న వర్షన్‌తో పోల్చితే, ఈరోజు మీరు ఎంతో పరిణతి సాధించారు. ఆనాడు మీరు కలలుగన్న కొన్ని క్షణాలను ఈరోజు నిజంగా అనుభవిస్తున్నారు.

"జీవితంలో ఎదుగుదల అనేది రాత్రికి రాత్రి వచ్చే మార్పు కాదు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, మనకు ఏది సెట్ అవుతుందో తెలుసుకోవడమే నిజమైన వ్యక్తిగత వికాసం" అని మానసిక నిపుణులు చెబుతున్నారు. కొత్త విషయాలను నేర్చుకోవాలనే కుతూహలం ఇంకా మీలో సజీవంగా ఉంటే, మీరు జీవితాన్ని మరింత అనుభవించడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం. వచ్చేవారం ప్లాన్ చేసుకోవడం లేదా తదుపరి ట్రిప్ గురించి ఆలోచించడం వంటి చిన్న చిన్న భవిష్యత్తు ప్రణాళికలు కూడా మీలో ఉన్న ఆశావహ దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి.

జీవితం ఎప్పుడూ ఒకేలా సాగదు. ఒడిదొడుకులు ఎదురైనప్పుడు స్థిరంగా నిలబడటం, నమ్మకమైన వ్యక్తులతో బంధాన్ని కలిగి ఉండటం, కొత్త రోజుపై నమ్మకంతో ముందుకు సాగడమే మీరు జీవితంలో అద్భుతంగా రాణిస్తున్నారని చెప్పడానికి అసలైన నిదర్శనాలు.

ఇది.. మనోభావ మాంద్యం!

దేశ ఆర్థిక వృద్ధి గణాంకాల్లో మెరుగ్గా కనిపిస్తున్నా, సామాన్యుడి మనసులో మాత్రం అలజడి రేగుతోంది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన తాజా వినియోగదారుల విశ్వాస సర్వేలో- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వరుసగా మూడోసారి ప్రజల విశ్వాసం క్షీణించింది. ఉద్యోగ భద్రతపై నమ్మకం సన్నగిల్లుతుండగా, ఆదాయ అంచనాలు నీరసిస్తున్నాయి. ఇంతకాలం "ఇవాళ కష్టమైనా రేపు బాగుంటుంది" అనుకునే భారతీయుల ఆశావాదం సైతం ఇప్పుడు బలహీనపడటం ఆందోళన కలిగిస్తోంది. అధికారిక ద్రవ్యోల్బణం అదుపులో ఉందని గణాంకాలు చెబుతున్నా, సామాన్యుడి జేబుకు మాత్రం ధరల మంట తప్పడం లేదు. ఫలితంగా అనవసర ఖర్చులపై చేయి వెనక్కి లాక్కుంటున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. దేశ జీడీపీలో అరవై శాతానికి పైగా వాటా వినియోగానిదే అయినప్పుడు, ఈ మనోభావ మాంద్యాన్ని విధానకర్తలు తేలిగ్గా తీసుకోకూడదు!

ప్రతి రెండు నెలలకోసారి రిజర్వ్ బ్యాంక్ దేశవ్యాప్తంగా వేలాది కుటుంబాలను కొన్ని సాధారణ ప్రశ్నలు అడుగుతుంది.. మీ ఆర్థిక పరిస్థితి ఏడాది క్రితం కన్నా మెరుగ్గా ఉందా, దిగజారిందా? మీ ఉద్యోగం ఎంత భద్రంగా ఉంది? ధరలు ఎంత వేగంగా పెరుగుతున్నాయి? మీ ఖర్చు అలవాట్లు ఎలా మారుతున్నాయి? జీడీపీ వృద్ధి రేటు, ద్రవ్యోల్బణం గణాంకాలంత హడావిడిగా వార్తలకెక్కకపోయినా, ఈ సర్వే ఫలితాలు దేశ ఆర్థిక నాడిని పసిగట్టడంలో కీలకమైనవి. 2026 మే నెలలో నిర్వహించిన తాజా రౌండ్ ఫలితాలు మాత్రం సాధారణం కాదు.. అవి తక్షణ శ్రద్ధ అవసరమని చాటిచెబుతున్నాయి! 19 నగరాల్లో నిర్వహించిన పట్టణ వినియోగదారుల విశ్వాస సర్వేలో, ప్రస్తుత పరిస్థితి సూచీ వరుసగా మూడోసారి క్షీణించి 95.7 నుంచి 90.7కు పడిపోయింది. వందకంటే తక్కువ నమోదైతే అది నిరాశావాద ధోరణికి సంకేతం. కేవలం ఒక్క రౌండ్‌లో పరిస్థితి "దిగజారింద"ని చెప్పిన కుటుంబాల శాతం 47.7శాతానికి చేరగా, "మెరుగైంద"ని చెప్పింది కేవలం 31.2శాతమే. దాదాపు 9వేల కుటుంబాలను కలుపుకున్న గ్రామీణ సర్వేలోనూ ఇదే ధోరణి ప్రతిబింబించింది. ప్రస్తుత పరిస్థితి సూచీ 95.2కు పడిపోగా, ఆర్థిక పరిస్థితిపై నికర స్పందన 2025 మే తర్వాత తొలిసారి రుణాత్మకంగా (మైనస్ 2.5) మారింది. 2025 మొత్తం స్థిరంగా ఉన్న ఉపాధి అంచనాలు సైతం ఇప్పుడు ప్రతికూలంగా మారడం గమనార్హం. అంతకన్నా ఆందోళనకరమైన అంశం.. భవిష్యత్‌పై ఆశావాదం సన్నగిల్లుతుండటం. నేటిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే రేపటిపై ఆశ పెంచుకోవడం భారతీయ వినియోగదారుల సర్వేల్లో కనిపించే ఒక సాధారణ లక్షణం. ఈ అంతరమే వినియోగ డిమాండ్‌కు నిశ్శబ్ద బలంగా నిలిచింది. కానీ ఇప్పుడు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రెండింటిలోనూ ఆ అంతరం కుంచించుకుపోతోంది. పట్టణ భవిష్యత్ అంచనాల సూచీ 118.7కు పడిపోయి 2023 సెప్టెంబరు తర్వాత అత్యల్ప స్థాయికి చేరగా, గ్రామీణ అంచనాల సూచీ జనవరిలో 129.3 నుంచి మేలో 119.3కు గణనీయంగా తగ్గింది.

ఈ మనోభావ క్షీణతను కేవలం సర్వే గణాంకాలుగా కొట్టిపారేయలేని కారణం ఒకటుంది; భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో వినియోగానికి అత్యంత కీలక పాత్ర ఉంది. తాజా ఆర్థిక సర్వే ప్రకారం, 2025-26లో వ్యక్తిగత తుది వినియోగ వ్యయం (పీఎఫ్‌సీఈ) జీడీపీలో 61.5శాతానికి చేరింది- ఇది 2011-12 తర్వాత అత్యధిక స్థాయి. అంటే, దేశ వృద్ధి ఇంజిన్‌లో ప్రజల జేబులోంచి వచ్చే ఖర్చే అతిపెద్ద చోదకశక్తి. కానీ ఇప్పుడు అదే ప్రజలు విచక్షణాధీన ఖర్చులపై చేయి వెనక్కి లాక్కుంటున్నారు. పట్టణ కుటుంబాల్లో అనవసర ఖర్చులపై సెంటిమెంట్ మార్చిలో 21.1గా ఉంటే మేకి కేవలం 15.9కే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే ధోరణి కనిపించి, నికర స్పందన 59.5 నుంచి 42.6కు ఒక్క రౌండ్‌లోనే పడిపోయింది. ఇది వినియోగ వస్తువులు, రిటైల్, సేవల రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే పరిణామం. దీనికితోడు ఒక విచిత్రమైన వైరుధ్యం కూడా బయటపడింది. అధికారిక రిటైల్ ద్రవ్యోల్బణం 2025-26లో సగటున 1.7శాతానికే పరిమితమై చాలా తక్కువగా ఉన్నా, ప్రజల అనుభవంలో ధరల భారం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. గ్రామీణ ప్రతివాదుల ప్రస్తుత ద్రవ్యోల్బణ అంచనా మేలో 5.9శాతానికి చేరి, మార్చితో పోలిస్తే 30 బేసిస్ పాయింట్లు పెరిగింది. రాబోయే ఏడాదికి వారి అంచనా ఏకంగా 7.2శాతానికి ఎగబాకింది. గణాంకాలు కొలిచేదానికి, కుటుంబాలు దుకాణంలో అనుభవించేదానికి మధ్య ఈ అంతరం కొత్తదేమీ కాదు. కానీ ఇది ఖర్చు, పొదుపు నిర్ణయాలను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి దీన్ని విస్మరించలేం! ధరలు ఏడు శాతానికి పైగా పెరుగుతాయని నమ్మే వినియోగదారుడు, ద్రవ్యోల్బణం అదుపులో ఉందని విశ్వసించే వినియోగదారుడితో పోలిస్తే పూర్తి భిన్నంగా వ్యవహరిస్తాడు- అధికారిక సూచీ ఏం చెప్పినా సరే.

ఈ పరిణామాలన్నింటినీ ఒకచోట చేర్చి చూస్తే కనిపించేది- ఏదో ఒక్క సూచీలో మందగమనం కాదు, భావోద్వేగ స్థాయిలోనే నెలకొన్న అనిశ్చితి. ఇది చివరికి కొనుగోలు నిర్ణయాలుగా, పెద్ద వ్యయాలుగా, రుణం తీసుకునే ధైర్యంగా మారే అంతర్గత చోదకశక్తి. ఇలాంటి సర్వేలు కేవలం మనోభావాన్ని పట్టిస్తాయి తప్ప, వాస్తవ లావాదేవీలను కాదని, మనోభావాలు అస్థిరంగా ఉంటాయని వాదించవచ్చు. కానీ గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండూ వరుసగా మూడో రౌండ్‌లో బలహీనమైన విశ్వాసాన్ని నివేదించినప్పుడు, భవిష్యత్ అంచనాలు వర్తమాన అవగాహనతో పాటే జారిపోతున్నప్పుడు, రెండు వర్గాల్లోనూ విచక్షణాధీన వ్యయ సంకల్పం మందగిస్తున్నప్పుడు- దీన్ని కేవలం సాధారణ అంశంగా కొట్టిపారేయలేం, ఒక సంకేతంగానే పరిగణించాలి! భారత వృద్ధి కథ ప్రధానంగా దేశీయ వినియోగంపైనే ఆధారపడి ఉంది, ఆ వినియోగం విశ్వాసంపైనే నిలబడుతుంది. సరిగ్గా ఇందుకోసమే రిజర్వ్ బ్యాంక్ ఈ సర్వేలను నిధులతో నిర్వహించి ప్రచురిస్తోంది- ఇవి ఒక ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పనిచేస్తాయి. కాగితంపై ఆర్థిక వ్యవస్థ ఎంత వేగంగా వృద్ధి చెందుతోందన్న దానికన్నా, సామాన్య భారతీయుడు తన ఆర్థిక భవిష్యత్తుపై ఎంత నమ్మకంతో ఉన్నాడన్న దానిపైనే విధానకర్తలు దృష్టి సారించాల్సిన సమయమిది. ధరల అవగాహన అంతరాన్ని పూడ్చే కమ్యూనికేషన్ వ్యూహాలు, గ్రామీణ ఆదాయ మద్దతు చర్యలు, ఉపాధి భద్రతపై విశ్వాసం పెంచే విధానాలు- వీటిపై శ్రద్ధ పెట్టకుండా, కేవలం స్థూల గణాంకాల ఆధారంగా వృద్ధిని వేడుక చేసుకోవడం అర్ధసత్యమే అవుతుంది. నగరంలో, పల్లెలో- రెండుచోట్లా ప్రజల నమ్మకాన్ని పునర్నిర్మించుకోవడమే నిజమైన ఆర్థిక పురోగతికి పునాది! ■



చాలామంది కేవలం నెలజీతాన్ని బట్టే ఆర్థిక విజయాన్ని అంచనా వేస్తారు. కానీ, నిజమైన ధనవంతులు తాము సంపాదించిన ఆస్తులు, పెట్టుబడుల ఆధారంగా విజయాన్ని కొలుస్తారు. నెలజీతం మీ ఖర్చులను తీర్చి, స్థిరత్వాన్ని మాత్రమే ఇవ్వగలదు. పూర్తి స్వేచ్ఛను ఇవ్వలేదు. పెట్టుబడులు, వ్యాపారాల ద్వారా వచ్చే ఆదాయం అలా కాదు. మీరు నిద్రిస్తున్నా, పని చేయకపోయినా మీ సంపద పెంచుతూనే ఉంటుంది. కాబట్టి సంపాదనలో కనీసం 10-30 శాతం భవిష్యత్తు కోసం పెట్టుబడి పెట్టండి. ఒక్కసారి కష్టపడి నిర్మించుకున్న పెట్టుబడుల వ్యవస్థ- కాలం గడిచేకొద్దీ మీ తరఫున నిరంతరం శ్రమిస్తూనే ఉంటుంది. అందుకే, -మీ డబ్బు కూడా మీ కోసం పనిచేసేలా ఈరోజే తొలి అడుగు వేయండి!

-మహాదేవ

వింతల్లో వింతలు

కొండను కొట్టిన స్టేషన్!

చైనాలోని చాంగ్‌కింగ్ నగరంలో ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌ను కేవలం 38 నెలల్లో నిర్మించి అబ్బురపరిచారు. 1.22 మిలియన్ చదరపు మీటర్ల విస్తీర్ణంలో- సుమారు 170 ఫుట్‌బాల్ మైదానాలంత పెద్దదిగా నిర్మించిన ఈ 'చాంగ్‌కింగ్ ఈస్ట్' స్టేషన్, న్యూయార్క్ గ్రాండ్ సెంట్రల్ కన్నా ఆరు రెట్లు, వాటికన్ సిటీ కన్నా రెండింతలు పెద్దది. 29 ప్లాట్‌ఫారాలు, 15 రైలు మార్గాలు, ఎనిమిది అంతస్తులు, 16,500 టన్నుల ఉక్కు పైకప్పుతో ఇది గంటకు 16వేల మంది ప్రయాణికులను నిర్వహించగలదు. కొండ ప్రాంతంలో నిర్మించిన ఈ స్టేషన్ కోసం మొదట పర్వతాన్ని పేల్చి చదును చేశారు. 40వేల మంది కార్మికులు, రోబోటిక్ యంత్రాలు కలిసి 20 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు, 3.66 లక్షల టన్నుల ఉక్కుతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. వారేవా చైనా అనిపిస్తోంది కదూ!

ఖాళీ కడుపుతో నిమ్మరసంలో ఇది కలిపి తాగుతున్నారా?

నేటి వేగవంతమైన జీవితంలో ఆరోగ్యంగా ఉండటం ఒక సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని చిన్న చిన్న చిట్కాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాటిలో ఒకటి, పరగడుపున నిమ్మకాయ, తేనె కలిపిన నీటిని తాగడం. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రారంభించడానికి చాలామంది ఉదయాన్నే నిమ్మరసం-తేనె నీటిని ఎంచుకుంటారు. ఇది ఒక పాతకాలపు పద్ధతి అయినప్పటికీ, దీని వల్ల కలిగే అద్భుత ప్రయోజనాల వల్ల నేటికీ ప్రాచుర్యం పొందుతోంది. కానీ, సరైన పద్ధతిలో పాటించకపోతే, దీని వల్ల కలిగే లాభనష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి నీటిలో నిమ్మరసం, తేనె కలపడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గడానికి ఒక దివ్యౌషధం లాంటిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను చంపడం ద్వారా నోటి దుర్వాసన సమస్యను తగ్గిస్తుంది. నిమ్మరసం కాలేయాన్ని శుభ్రపరచడానికి సహాయపడుతుంది. మీ కాలేయాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి, ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగండి. ఆరోగ్య ప్రయోజనాలు: నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షించడమే కాకుండా, సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూస్తుంది. శరీరంలోని వ్యర్థాల, టాక్సిన్లను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగుతారు. పరిమిత పరిమాణంలో తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ఖాళీ కడుపుతో తాగడం వల్ల ప్రయోజనానికి బదులుగా హాని జరగవచ్చునని నిపుణులు చెబుతున్నారు. నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, దానిని తీసుకునే విధానంలో కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు పరగడుపున నిమ్మరసం తాగడం వల్ల కడుపులో మంట వచ్చే అవకాశం ఉంది. వీరు అల్పాహారం చేసిన 40 నిమిషాల తర్వాత తీసుకోవడం మంచిది. భోజనానికి ముందు లేదా తిన్న వెంటనే దీనిని తాగకూడదు. అలా చేస్తే మనం తిన్న ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించలేదు. నిమ్మరసం నీరు ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. అయితే పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తూ దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

డీహైడ్రేషన్ నుంచి కాపాడటంలో దీని తర్వాతే ఏదైనా

వేసవి కాలం వచ్చేసింది. ఎండలు తీవ్రమవుతున్న కొద్దీ మన శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో వేగంగా తగ్గిపోతుంది. కేవలం నీళ్లు తాగడం మాత్రమే కాకుండా, మనం తీసుకునే ఆహారం ద్వారా కూడా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవచ్చు. వేసవి పండ్ల గురించి మాట్లాడేటప్పుడు అందరికీ మొదటగా గుర్తొచ్చేది 'పుచ్చకాయ'. దాదాపు 91 నుండి 92 శాతం నీటిని కలిగి ఉండే పుచ్చకాయ, ఎండల బారి నుండి మనల్ని రక్షించే అద్భుతమైన ఫలమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. ఎండలో తిరిగేటప్పుడు వచ్చే అలసట, తలనొప్పి వంటి సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయలో ఉండే అత్యధిక నీటి శాతం మరియు ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడతాయి. ఎండ వేడి వల్ల కలిగే అలసట, మైకము వంటి లక్షణాలను ఇది తగ్గిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి మరియు లైకోపిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎండ వల్ల దెబ్బతినే చర్మాన్ని రక్షించి, చర్మం తాజాగా ఉండేలా చేస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. ఇది కడుపుని నిండుగా ఉంచుతూనే శరీరాన్ని తేలికగా ఉంచుతుంది. పుచ్చకాయను ఉదయం పూట స్నాక్‌లా తీసుకోవడం లేదా పండ్ల ముక్కలతో కలిపి సలాడ్‌లా తీసుకోవడం మంచిది. ఎటువంటి చక్కెర కలపకుండా తాజాగా జ్యూస్ చేసుకుని తాగవచ్చు. దీనికి కొద్దిగా పుదీనా ఆకులు కలిపితే రుచితో పాటు చలువ కూడా చేస్తుంది. వేసవిలో వచ్చే ఇతర పండ్లైన కర్బూజ (90%), స్ట్రాబెర్రీ (91%), ఆరెంజ్ (87%) మరియు పైనాపిల్ (86%) లలో కూడా నీటి శాతం ఎక్కువే ఉన్నప్పటికీ, పుచ్చకాయ వీటన్నింటికంటే ముందంజలో ఉంది. అయితే, చాలామంది పండ్ల జాబితాలో దోసకాయను మర్చిపోతుంటారు. నిజానికి దోసకాయలో 95 నుండి 96 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం వంటి ఖనిజాలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు డీహైడ్రేషన్ బారిన పడకుండా శరీరాన్ని అద్భుతంగా కాపాడతాయి. కాబట్టి పుచ్చకాయతో పాటు దోసకాయను కూడా మీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల వేసవి తాపాన్ని సులభంగా అధిగమించవచ్చు.

తక్షణ శక్తికోసం ఏది తినాలి?

మన నిత్య జీవితంలో పనులు చేసుకోవడానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు మన ఆహారం ద్వారా అందుతాయి. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి ఏ సమయంలో, ఎలా శక్తిని ఇస్తుందనేది చాలా ముఖ్యం. కొన్నిసార్లు మనకు తక్షణమే ఉత్సాహం రావాల్సి ఉంటుంది. మరికొన్ని సందర్భాల్లో రోజంతా పని చేయడానికి స్థిరమైన శక్తి అవసరమవుతుంది. అటువంటి సమయాల్లో అరటిపండ్లు, ఖర్జూరాలు మనకు అద్భుతమైన ఎంపికలుగా నిలుస్తాయి. ఈ రెండూ శక్తిని అందించినప్పటికీ, వాటి పోషక విలువలలో ఉండే స్వల్ప తేడాల వల్ల వాటిని తీసుకునే సమయం వేరుగా ఉండాలి. అరటిపండ్ల విషయానికి వస్తే, వీటిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు అరటిపండులో సుమారు 100 నుండి 150 కేలరీలు ఉంటాయి. వీటిలో సహజ చక్కెరలతో పాటు పిండి పదార్థాలు ఉండటం వల్ల శరీరానికి నిరంతరాయంగా, స్థిరమైన శక్తిని అందిస్తాయి. అంతేకాకుండా అరటిపండ్లలో ఉండే పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి వంటి పోషకాలు శరీర అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా కండరాల పనితీరును మెరుగుపరచడంలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది వ్యాయామం చేసే సమయంలో వచ్చే కండరాల తిమ్మిర్లను తగ్గించడానికి సహాయపడుతుంది.

మరోవైపు ఖర్జూరాలు తక్షణ శక్తిని అందించడంలో మేటిగా నిలుస్తాయి. కేవలం 3 నుండి 4 ఖర్జూరాలలో 90 నుండి 120 కేలరీలు లభిస్తాయి. వీటిలో సహజ చక్కెరలు పుష్కలంగా ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు లేదా ఉపవాసం ఉన్నప్పుడు తీసుకుంటే వెంటనే ఉత్సాహం వస్తుంది. ఖర్జూరాల్లో చక్కెరతో పాటు ఫైబర్, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా రక్తహీనత సమస్యతో బాధపడేవారికి ఖర్జూరాలు ఒక అద్భుతమైన పోషకాహారంగా పనిచేస్తాయి. తీవ్రమైన శారీరక శ్రమ చేసేవారికి కూడా ఇవి తక్షణ ఇంధనంలా ఉపయోగపడతాయి. షుగర్ వ్యాధిగ్రస్తులు పండ్ల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి. అరటిపండ్లు మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల ఇవి రక్తంలోని చక్కెర స్థాయిని ఒక్కసారిగా పెంచవు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు వీటిని సాధారణ పరిమాణంలో తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు, పేగు ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఖర్జూరాలకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖర్జూరాలకు దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ తీసుకోవాలనుకుంటే ఒకటి లేదా రెండు మాత్రమే తీసుకోవాలి, అందులోని ఫైబర్ చక్కెర నియంత్రణకు కొంతవరకు తోడ్పడుతుంది. మన శరీర అవసరాలను బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. సులభంగా చెప్పాలంటే, మీరు వెంటనే రీఛార్జ్ అవ్వాలి అనుకుంటే ఖర్జూరాలు తీసుకోవాలి. అదే మీరు వ్యాయామం చేయాలన్నా లేదా రోజంతా చురుగ్గా ఉండాలన్నా అరటిపండ్లు తీసుకోవడం ఉత్తమం. ఈ రెండింటిలోనూ విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మీ దైనందిన జీవితంలో వీటిని సరైన పద్ధతిలో చేర్చుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.



భారత్ వరుస ఓటములు.. కన్నీరు పెట్టుకున్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

హైదరాబాద్ పెన్ పవర్: ఇంగ్లాండ్‌తోని ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరిగిన మూడో టీ20ల మన టీమిండియా మస్తు దారుణంగా ఓడిపోయింది. పరుగుల పరంగా చూస్తే టీ20 చరిత్రలనే ఇది ఇండియాకు అత్యంత ఘోరమైన ఓటమి. రీసెంట్‌గానే టీ20 వరల్డ్ కప్ గెలిచిన మనోళ్లు.. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్లు జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ వేసిన 90 ఎజూప్త (145 ఎప్త) బుల్లెట్ బాల్స్‌కు ఏం చేయాలో తెలియక చేతులెత్తేసింర్రు. ఈ దెబ్బతోటి 5 మ్యాచ్‌ల సిరీస్‌ల ఇంగ్లాండ్ 2-0 తో తిరుగులేని లీడ్‌లోకి వెళ్ళిపోయింది.

ఆట అస్సలు ఒప్పుకోలేం: శ్రేయస్

మ్యాచ్ ముగిసినంక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. మేము చాలా దారుణంగా ఆడినం.. అంటు స్టేడియంలోనే కన్నీరు పెట్టుకునేంత పని చేశాడు. 125 పరుగుల భారీ మార్జిన్‌తోని ఓడిపోవడం అస్సలు జీర్ణించుకోలేకపోతున్నాం.. వికెట్ మీద బౌలర్లకు లెంత్ హెల్ప్ అయింది, కానీ మావాళ్లు ప్లాన్స్ సరిగ్గా అమలు చేయలేదు.. రన్ చేజ్ చేసేటప్పుడు ఒక పద్ధతి ఉండాలి.. మా ప్లానింగ్ మొత్తం దారుణంగా ఫెయిల్ అయిందన్నాడు.

పవర్‌ప్లేలనే డగౌట్ కి క్యూ:

ఇంగ్లాండ్ మొదట బ్యాటింగ్ చేసి 201-7 భారీ స్కోరు కొట్టింది. వాళ్ల ఓపెనర్ ఫిల్ సాల్ట్ (70 రన్స్) ఒక్కడే కొట్టిన స్కోరును.. టీమ్ మొత్తం కలిసి కూడా దాటలేక ఖపోయింది. 12 ఓవర్లు కూడా తిరక్కుండానే ఇండియా 76 పరుగులకే ఆలౌట్ అయింది. 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని ఆర్చర్ ఒక 90 ఎజూప్త బౌన్సర్‌తో భయపెట్టిండు, ఆ నెక్స్ట్ బాలే అతడు సిక్స్ కొట్టినా.. ఆ తర్వాత ఆర్చర్ వేసిన బౌన్సర్‌కే కీపర్ క్యాచ్ ఇచ్చి అవుట్ అయిండు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, కెప్టెన్ అయ్యర్, అక్షర్ పటేల్.. అంతా క్యూ కట్టేసరికి 5 ఓవర్లకే ఇండియా 25 రన్స్ కే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత తిలక్ వర్మ స్టంపౌట్ కాగా.. హోమ్ గ్రౌండ్‌ల ఆడుతున్న జోష్ టంగ్ (4--28) శివమ్ దూబే, హర్షిత్ రాణాలను అవుట్ చేసి కెరీర్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చిండు. భారత్ తన లోయెస్ట్ స్కోరు (74 రన్స్) ను దాటితే చాలు అన్నట్టుగా బ్యాటింగ్ చేసింది.

హ్యారీ బ్రూక్ సేన హవా:

ఇంకోవైపు ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాత్రం ఫుల్ ఖుషీగా ఉన్నాడు. సాల్ట్ కిరాక్ ఇన్నింగ్స్ ఆడిండు. ఇలాంటి వికెట్ మీద 200o కొట్టడం మామూలు ముచ్చట కాదు.. మా బౌలర్లకు మేమేం పెద్దగా ఏం చెప్పలేదు.. టాప్ ఆఫ్ ది స్టంప్స్ హిట్ చేయమన్నం, మధ్య మధ్యలో బౌన్సర్లు వేయమన్నం.. ఆ సింపుల్ ప్లాన్ పక్కా వర్కవుట్ అయిందని బ్రూక్ చెప్పుకొచ్చాడు.

బ్రిస్టల్‌లో డూ ఆర్ డై మ్యాచ్:

గత నెలల ఐర్లాండ్‌తోని సిరీస్ ఓడిపోయిన మనోళ్లకు, ఇదో పెద్ద షాక్. ఈ ఘోర పరాజయం 2019లో న్యూజిలాండ్‌పై ఎదురైన 80 రన్స్ ఓటమి రికార్డును కూడా తుడిచేసింది. ఇక గురువారం బ్రిస్టల్‌ల జరిగే నాలుగో టీ20లో ఇంగ్లాండ్ గెలిస్తే సిరీస్ వాళ్ల సొంతమవుతుంది.

కానీ శ్రేయస్ అయ్యర్ మాత్రం ఇంకా హోప్స్ వదులుకోలేదు. స్ట్రాంగ్‌గా కమ్‌బ్యాక్ ఇవ్వడానికి ఇదో మంచి ఛాన్స్.. జరిగిపోయిన దాన్ని పట్టుకొని ఏడవడం కంటే.. దారుణంగా ఆడినా కూడా ఈ మ్యాచ్ నుంచి నేర్చుకోవాల్సింది మస్తు ఉందని చెప్పుకొచ్చాడు. మరి నెక్స్ట్ మ్యాచ్‌లైనా భారత్ పుంజుకుంటుందో లేదో..

ఇది ఫుట్‌బాలా.. ఫిక్సింగా?.. అర్జెంటీనాకే వరల్డ్‌కప్ ఇచ్చేయండి

హైదరాబాద్ పెన్ పవర్: ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లల్లా ఈజిప్ట్ జట్టు 78వ నిమిషం దాకా 2--0తో ఫుల్ లీడ్‌ల ఉండె.. కానీ ఆ తర్వాత అర్జెంటీనా కమ్‌బ్యాక్ ఇచ్చి 3--2తో మ్యాచ్‌ను గుంజేసుకుంది. అయితే ఈ మ్యాచ్ ముగిసినంక ఈజిప్ట్ కోచ్ హొస్సామ్ హసన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో దారుణంగా తిట్టిపోసిండు. రెఫరీ, VAR (వీడియో అసిస్టెంట్ రెఫరీ) టీమ్ కలిసి కావాలనే అర్జెంటీనాకు ఫేవర్‌గా నిర్ణయాలు ఇస్తూ.. వాళ్లు గెలవడానికి గేట్లు బార్లా తెరిచారని ఆరోపించిండు. మ్యాచ్‌లో చాలా నిర్ణయాలు అర్జెంటీనాకే ప్లస్ అయినా.. ఈ రెండు పెద్ద నిర్ణయాలు మాత్రం ఈజిప్ట్ కొంపముంచినాయి.

వెనక్కి పోయి మరి ఈజిప్ట్ గోల్‌ను రద్దు చేస్తారా?:

ఈజిప్ట్ 1--0 లీడ్‌ల ఉన్నప్పుడు.. వాళ్ల మిడ్‌ఫీల్డర్ మోస్తఫా జికో ఒక అదిరిపోయే కౌంటర్ ఎటాక్‌తోని అదిరిపోయే గోల్ కొట్టిండు. నిజానికి ఆ గోల్ ఇచ్చుంటే ఈజిప్ట్ 2--0తో సేఫ్ జోన్‌లోకి వెళ్లేది. కానీ రెఫరీ ఫ్రాంకోయిస్ లెటెక్సియర్‌ను వార్ టీమ్ స్క్రీన్ చూసుకోమని పిలిచింది. ఆ గోల్ కొట్టడానికి ఓ 10 సెకన్ల ముందు, అండ్ 100 గజాల దూరంలో (ఈజిప్ట్ హాఫ్‌లో) అర్జెంటీనా ప్లేయర్ లిసాండ్రో మార్టినెజ్ కాళ్లను ఈజిప్ట్ మిడ్‌ఫీల్డర్ మర్వాన్ అత్తియా తొక్కిండు, షర్ట్ లాగిండు అని సాకు చూపించారు.

ఈజిప్ట్ ఫ్యాన్స్ ఆగ్రహం:

అర్జెంటీనా ఎటాక్ చేస్తున్నప్పుడు ఈజిప్ట్ డిఫెండర్లు బాల్‌ను లాక్కుని, గ్రౌండ్ మొత్తం పరిగెత్తుకుంటూ పోయి గోల్ కొడితే.. ఎక్కడో వంద గజాల వెనక జరిగిన చిన్న ఫౌల్‌ను పట్టుకొని గోల్ క్యాన్సిల్ చేయడం ఏంటని ఫ్యాన్స్ మండిపడుతున్నారు. జికో ఆ తర్వాత కొద్దిసేపటికే ఎలాగోలా ఇంకో గోల్ కొట్టి 2--0 చేసినా.. ఒకవేళ ఆ ముందటి గోల్ ఇచ్చి ఉంటే ఈజిప్ట్ 3-0తో మ్యాచ్‌ను గెలిచేది.

సలాహ్‌ను కింద పడేసినా పెనాల్టీ ఇవ్వరా: ఈజిప్ట్

మ్యాచ్ లాస్ట్ స్టేజికి వచ్చేసరికి ఈజిప్ట్ మళ్లీ పుంజుకునేందుకు ట్రై చేసింది. ఆ టైమ్‌లో అర్జెంటీనా పెనాల్టీ బాక్స్‌లో ఈజిప్ట్ స్టార్ ప్లేయర్ మొహమ్మద్ సలాహ్‌ను జూలియన్ అల్వారెజ్ పక్కాగా షర్ట్ పట్టి లాగిండు, అతడి కాలును కూడా తొక్కి కింద పడేసిండు. ఈజిప్ట్ ప్లేయర్లు పెనాల్టీ కోసం గట్టిగానే డిమాండ్ చేశారు. రెఫరీ కళ్లముందే అంత పెద్ద ఫౌల్ జరిగినా ఆటను కంటిన్యూ చేయమన్నాడు. పోనీ వార్ టీమ్ అయినా చెప్తదా అంటే.. వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు. ఈజిప్ట్ కొట్టిన గోల్ అప్పుడు వెనక్కి వెళ్లి మరీ ఫౌల్ వెతికిన VAR.. ఇక్కడ సలాహ్‌ను పెనాల్టీ బాక్స్‌లో అంత క్లియర్‌గా షర్ట్ లాగి పడేసినా పట్టించుకోకపోవడంతోపై సీరియస్ అవుతున్నారు.

ఈజిప్ట్ గుండె పగిలింది.. అర్జెంటీనా విన్నింగ్ గోల్:

అర్జెంటీనా ప్లేయర్లు పదే పదే ఫౌల్స్ చేస్తున్నా రెఫరీ కనీసం కార్డ్స్ కూడా ఇవ్వకుండా వదిలేసిండు. దీనికి సంబంధించిన ఒక వీడియో కంపైలేషన్ కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తమకు రావాల్సిన పెనాల్టీని అన్యాయంగా రద్దు చేయడంతో ఈజిప్ట్ క్యాంప్ మొత్తం తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయింది. ఆ బాధలో వాళ్లు ఉండగానే.. ఇంజూరీ టైమ్‌లో అర్జెంటీనా ప్లేయర్ ఎంజో ఫెర్నాండెజ్ విన్నింగ్ గోల్ కొట్టి ఈజిప్ట్ గుండె పగిలేలా చేసిండు. అర్జెంటీనా క్వార్టర్స్‌కు పోయినా.. ఈ మ్యాచ్ లొల్లి మాత్రం వరల్డ్ కప్ చరిత్రలనే వన్ ఆఫ్ ది మోస్ట్ కాంట్రవర్షియల్ మ్యాచ్‌గా నిలిచిపోయింది.

హర్షిత్ రాణాతో అంత రిస్క్ అవసరమా గంభీర్?.. దినేశ్ కార్తీక్ ఫుల్ ఫైర్!

హైదరాబాద్ పెన్ పవర్: ఇంగ్లాండ్‌తోని జరిగిన మూడో టీ20లో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వేసిన ఒక వింత ప్లాన్ (స్ట్రాటజీ) చూసి.. మాజీ క్రికెటర్, కామెంటేటర్ దినేష్ కార్తీక్ (డిఖ) ఫుల్ గరం అయ్యాడు. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలోని ఇంగ్లాండ్ టీమ్ మన భారత జట్టు బ్యాటింగ్ లైన్ అప్‌ను ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఘోరంగా దెబ్బకొట్టింది.

పవర్‌ప్లేలనే తుస్సుమన్న టాప్ ఆర్డర్:

మ్యాచ్ స్టార్ట్ అయిందో లేదో.. ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి ఇండియన్ బ్యాటర్లు ఒకరి వెనుక ఒకరు డగౌట్ కి క్యూ కట్టింర్రు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్.. ఈ ఐదుగురు ప్లేయర్లు మొదటి 6 ఓవర్లనే పెవిలియన్ బాట పట్టింర్రు. దీంతో టీమిండియా తీవ్ర కష్టాల్లో పడిన సమయంలో హెడ్ కోచ్ గంభీర్ అసలు ఎవరు ఊహించని ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఆల్‌రౌండర్ శివమ్ దూబే కంటే ముందే ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాను బ్యాటింగ్‌కు పంపించిండు.

అతడు పవర్‌ప్లేలో ఆడలేడు: డీకే ఫైర్

ఈ వింత ప్రయోగం చూసి దినేష్ కార్తీక్ కామెంట్రీ బాక్స్ నుంచే కోచ్ గౌతమ్ గంభీర్ ని గట్టిగానే ప్రశ్నించిండు. శివమ్ దూబే కంటే ముందే హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడం ఏంటి.. మీరు ఏమైనా జోకులు వేస్తున్నారా? నాకు తెలిసి హర్షిత్ రాణా డొమెస్టిక్ క్రికెట్‌లో కూడా ఎప్పుడూ పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేయలేదు.. టీ20 క్రికెట్‌లో రైట్-లెఫ్ట్ కాంబినేషన్ వర్కవుట్ చేయొచ్చు, కానీ దానికి కూడా ఒక లిమిట్ ఉంటది. అంతేకాని దూబే కంటే ముందు రాణాను బ్యాటింగ్ కి పంపడం ఏ మాత్రం కరెక్ట్ కాదని ఫుల్ ఫైర్ అయ్యాడు.

భారత్ సిరీస్ గెలిచే అవకాశం లేదు:

టాప్ ఆర్డర్ దారుణంగా ఫెయిల్ కావడంతో, టీమిండియా చరిత్రలోనే వన్ ఆఫ్ ది వరస్ట్ బ్యాటింగ్ పర్ఫార్మెన్స్ ఇచ్చింది. ట్రెంట్ బ్రిడ్జ్ మ్యాచ్‌లో ఇండియా కేవలం 76 పరుగులకే ఆలౌట్ అయింది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్ చరిత్రలోనే ఇది భారత్ కు రెండో అత్యల్ప స్కోరు. 125 పరుగుల తేడాతో గెలిచిన ఇంగ్లాండ్ టీమ్ ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ని 2--0తో లీడ్‌లోకి దూసుకెళ్లింది. కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఫస్ట్ విక్టరీ కోసం చూస్తున్న భారత్.. ఈ సిరీస్ గెలిచే ఛాన్స్‌ను చేజేతులా పోగొట్టుకుంది.

ఆ రెండు మ్యాచ్‌లు గెలవాల్సిందే:

ఇగ వరుసగా సిరీస్‌లు ఓడిపోకుండా ఇజ్జత్ కాపాడుకోవాలంటే.. టీమిండియా మిగిలిన రెండు మ్యాచ్‌లను పక్కా గెలవాల్సిందే. ఇంకోవైపు ఇంగ్లాండ్ టీమ్ నెక్స్ట్ మ్యాచ్ గెలిస్తే చాలు.. సిరీస్‌ను కైవసం చేసుకుంటది. మరి బ్రిస్టల్‌లో జరిగే మ్యాచ్‌లైనా గంభీర్ ఇలాంటి వింత ప్రయోగాలు ఆపుతాడో లేదో చూడాల్సి ఉంది.

శృతి హాసన్ స్టన్నింగ్ లుక్.. బ్యాక్ ఫోజులతో..

రిద్ధి కుమార్ మిర్రర్ సెల్ఫీలో ఆత్మవిశ్వాసం, స్టైల్ ఉట్టిపడుతున్నాయి

మల్టీటాలెంటెడ్ స్టార్ శృతి హాసన్ తన సరికొత్త ఫోటోషూట్‌తో నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. ట్రెడిషనల్ వేర్‌లో రాయల్ లుక్‌ను తలపిస్తూ ఆమె దిగిన కొన్ని ప్రత్యేకమైన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఒకప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ, ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా తన గ్లామరస్ అప్‌డేట్స్ ఇస్తూ ఫ్యాన్స్‌కు నిరంతరం టచ్‌లో ఉంటోంది. ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న ఆమె లేటెస్ట్ ఎలిగెంట్ లుక్ విశేషాలు చూద్దాం..

శృతి రాయల్ లుక్ సీక్రెట్:

ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో శృతి హాసన్ లుక్ ఎంతో రిచ్‌గా, క్లాసీగా ఉంది. ఆమె జిగేల్‌మనే జిలుగు వెలుగుల సేజ్ గ్రీన్ కలర్ సారీని ధరించారు. ఇక బాడీకి పర్ఫెక్ట్‌గా సెట్ అయిన ఈ శారీపై ఎంతో అద్భుతమైన డిజైన్స్, ఇంట్రికేట్ ప్యాటర్న్స్ ఉన్నాయి. ఇక దీనికి మ్యాచింగ్ బ్లౌజ్‌ను జత చేసి ఆమె ఇచ్చిన రాయల్ పోజ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ క్లాసిక్ శారీ స్టైలింగ్‌ను ప్రత్యేక డిజైన్ చేయగా.. మీరా అటైర్ బ్లౌజ్ డిజైన్‌ను అందించారు.

మెస్మరైజ్ చేస్తున్న ఎమరాల్డ్ జ్యువెలరీ:

ఈ రాయల్ శారీ లుక్‌కు తోడు ఆమె పెట్టుకున్న జ్యువెలరీ సినిమాకు మెయిన్ హైలైట్‌లా నిలిచింది. తారాస్య సిల్వర్ జ్యువెలరీ అందించిన స్టేట్‌మెంట్ ఎమరాల్డ్ పచ్చల నగలు శృతి అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఇక దీనికి తోడు చాలా సింపుల్‌గా హెయిర్ స్టైల్, క్లాసీగా ఉన్న ఫ్లావలెస్ మేకప్ ఆమె ముఖ కవళికలను ఎంతో అందంగా ఎలివేట్ చేశాయి. ఇక ట్రెడిషనల్ అవుట్‌ఫిట్‌లో మోడ్రన్ టచ్ ఇస్తూ మెగ్గియో బ్రాండ్ కి సంబంధించిన ఫుట్‌వేర్‌ను ఆమె మ్యాచ్ చేశారు.

వైవిధ్యమైన నటన.. సింగర్‌గా స్పెషల్ క్రేజ్:

శృతి హాసన్ కేవలం నటి మాత్రమే కాదు, ఆమె ఒక అద్భుతమైన సింగర్, మ్యూజిషియన్ కూడా. గతంలో ఆమె రిలీజ్ చేసిన పలు సింగిల్స్ మ్యూజిక్ లవర్స్‌ను ఎంతగానో అలరించాయి. ఇక సినిమాల విషయానికి వస్తే.. తమిళ్‌లో 7ఆమ్ అరివు, హిందీలో డి-డే చిత్రాలతో పాటు గబ్బర్ ఈజ్ బ్యాక్, వేదాళం, వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తన వర్సటాలిటీని నిరూపించుకున్నారు. ఇక నటనతో పాటు మ్యూజిక్ కెరీర్‌ను కూడా ఆమె అంతే పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తున్నారు.

'పెద్ది' ఐటెం సాంగ్ నుండి 'సలార్ 2' వరకు:

గత కొంతకాలంగా సినిమాల ఎంపికలో శృతి చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. తక్కువ సినిమాలు చేస్తున్నా.. అందులో ఇంపాక్ట్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో ఒక స్పెషల్ సాంగ్‌లో మెరిసి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఇక ప్రస్తుతం ప్రభాస్ హీరోగా రాబోతున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'సలార్ 2' లో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

ఫ్యాషన్ ప్రియులకు పర్ఫెక్ట్ ఇన్‌స్పిరేషన్:

శృతి హాసన్ చేసిన ఈ సరికొత్త ట్రెడిషనల్ ఫోటోషూట్ శారీ లవర్స్‌కు మరియు ఫ్యాషన్ ప్రియులకు ఒక పర్ఫెక్ట్ ఇన్‌స్పిరేషన్ అని చెప్పొచ్చు. ట్రెడిషనల్ శారీలో కూడా ఇంత గ్లామరస్‌గా, ఎలిగెంట్‌గా ఎలా కనిపించవచ్చో ఆమె మరోసారి ప్రూవ్ చేశారు. ఇక ప్రస్తుతం చేతిలో ఉన్న క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్టులతో శృతి రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలని ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965